E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 20-05-2025 (వారం) మంగళవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



తెలంగాణలో మరో నాలుగు రోజుల పాటు వర్షాలు » 2లో

## కాళేశ్వరం ఆనకట్టల విచారణ కమిషన్ గడువు పొడిగింపు



కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై ఏర్పాటు చేసిన న్యాయవిచారణ కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం పెంచింది.

ఈ కబురు,హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది.

తరువాయి 2లో

## ఇందిర సౌర గిరి జల వికాసం..
### రైతులకు ఉచితంగా సోలార్ పంపుసెట్లు



- గిరిజనులకు సాగునీరందిస్తున్న ఘనత మా ప్రభుత్వానిదే
- నాడు వరి వేస్తే ఉరి అన్నారు.. మేం సన్నబియ్యంతో పేదల కడుపు నింపుతున్నాం
- 100 రోజుల్లో అచ్చంపేట నియోజకవర్గంలోని రైతులందరికీ సోలార్ పంపులు
- 'ఇందిర సౌర గిరి జల వికాసం' ప్రారంభోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

*నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకం ప్రారంభోత్సవ శిలాఫలకం ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. చిత్రంలో షబ్బీర్ అలీ, వీర్లపల్లి శంకర్, చిన్నారెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, దామోదర్ రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క తదితరులు*

ఈ కబురు, మహబూబ్‌నగర్ న్యూస్‌టుడే, నాగర్‌కర్నూల్, అచ్చంపేట న్యూటౌన్, అమ్రాబాద్: పోడు భూముల కోసం పోరాటం చేసిన గిరిజనులను జైల్లో పెట్టిన చరిత్ర గత ప్రభుత్వానిదైతే.. ఆ భూముల్లో బోర్లు వేసి సౌర విద్యుత్‌తో సాగునీరు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. వరి వేస్తే ఉరి అని గత సర్కారు అంటే.. అదే రైతన్న సన్నధాన్యం పండించేలా చేసి పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తూ కడుపు నింపుతున్నామన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాచారంలో జలంధర్ అనే గ్రామస్థుడు నిర్మించిన సీతారామాంజనేయ ఆలయంలో ముఖ్యమంత్రి, మంత్రులు పూజలు చేశారు. ఆ తర్వాత అచ్చంపేట ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. ''ఎన్నికల వేళ ఎమ్మెల్యేగా వంశీకృష్ణను గెలిపించాలని కోరితే.. 50 వేలకు పైగా మెజార్టీ ఇచ్చి ఆశీర్వదించారు.. ఇప్పుడు నా బాధ్యత మరింత పెరిగింది. అందుకే ఈ ప్రాంతం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించాను. అచ్చంపేట నియోజకవర్గంలో బోరుబావి ఉన్న రైతులందరికీ 100 రోజుల్లో సోలార్ విద్యుత్ యూనిట్లు, పంపుసెట్లు అందిస్తాం. వారి అవసరాలకు వినియోగించుకోగా మిగిలిన సౌర విద్యుత్‌ను విక్రయించి నెలకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకుంటాం.

తరువాయి 2లో



## అందాల పోటీలే కాదు..
### అగ్ని ప్రమాదాల మీదా దృష్టిపెట్టాలి: కేటీఆర్

అందాల పోటీల మీదే కాదు.. అగ్ని ప్రమాదాల మీద కూడా దృష్టిపెట్టాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు.

ఈ కబురు,హైదరాబాద్: అందాల పోటీల మీదే కాదు.. అగ్ని ప్రమాదాల మీద కూడా దృష్టి పెట్టాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. అగ్ని ప్రమాదాల్లో మరో ప్రాణం పోకుండా ప్రభుత్వం చూడాలన్నారు. చార్మినార్ పరిధి గుల్జార్‌హౌజ్ సమీపంలో అగ్నిప్రమాదం జరిగిన భవనాన్ని ఆయన పరిశీలించారు. తాను రాజకీయంగా మాట్లాడటానికి ఇక్కడికి రాలేదని చెప్పారు. ప్రభుత్వాలు ప్రజల ప్రాణాలు కాపాడాలని పేర్కొన్నారు.

తరువాయి 2లో

## 60 ఏళ్ల తర్వాత ఇజ్రాయెల్‌కు 'గూఢచారి' వస్తువులు




60 ఏళ్ల తర్వాత ఇజ్రాయెల్ గూఢచారి ఎలి కోహెన్‌కు సంబంధించిన వస్తువులను టెల్‌అవీవ్ తిరిగి సొంతం చేసుకుంది.

ఈ కబురు: ఇజ్రాయెల్ కు చెందిన గూఢచారి ఎలి కోహెన్ కు సంబంధించిన వేలాది వస్తువులను 60 ఏళ్ల తర్వాత సిరియా నుంచి టెల్‌అవీవ్ సొంతం చేసుకొంది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు స్వయంగా వెల్లడించారు. ఆయన భార్య నాడియో కోహెన్ తో నెతన్యాహు వాటిని పంచుకున్నారు.

తరువాయి 2లో

## పాక్ టార్గెట్‌లో గోల్డెన్ టెంపుల్..
### గీతకూడా పడనివ్వని భారత ఆర్మీ



ఆపరేషన్ సిందూర్ అనంతరం అక్కసుతో అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయాన్ని లక్ష్యంగా చేసుకొని పాక్ డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించగా.. భారత్ తిప్పికొట్టింది.

ఈ కబురు:ఆపరేషన్ సిందూర్ ను జీర్ణించుకోలేని పాకిస్థాన్.. మనదేశం మీదకు క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఆపరేషన్ తర్వాత అక్కసుతో పంజాబ్‌లో అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయాన్ని లక్ష్యంగా చేసుకుందని మేజర్ జనరల్ కార్తిక్ సి శేషాద్రి వెల్లడించారు. వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టామని తెలిపారు .

తరువాయి 2లో



## మద్యం ధరలు పెంచి ఖజానా నింపుకొంటారా?

అడ్డగోలుగా మద్యం ధరలు పెంచి వాటి విక్రయాల ద్వారా ఖజానా నిలుపుకోవాలని చూస్తారా అని ప్రభుత్వంపై భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ కబురు, హైదరాబాద్: అడ్డగోలుగా మద్యం ధరలు పెంచి వాటి విక్రయాల ద్వారా ఖజానా నిలుపుకోవాలని చూస్తారా అని ప్రభుత్వంపై భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం ద్వారా వచ్చే ఆదాయంలో తెలంగాణను నంబర్ 1 చేస్తారా? ఇదేనా మీరు చెబుతున్న తెలంగాణ రైజింగ్ అంటే? అంటూ మండిపడ్డారు. మద్యం ధరల పెంపును ఖండిస్తూ ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ''పాలన గాలికి వదిలి, సంక్షేమ పథకాలను అటకెక్కించి.. ప్రజల ప్రాణాలు కాపాడాలని పేర్కొన్నారు.

తరువాయి 2లో

## పాక్ అనుకూల ప్రచారం వ్యాప్తి కోసం.. జ్యోతి మల్హోత్రాకు ఆదేశాలు..!

తరువాయి 3లో

సన్‌రైజర్స్‌కు నాలుగో విజయం.. ప్లే ఆఫ్స్ రేసు నుంచి లఖ్‌నవూ ఔట్ » 6లో



12 మ్యాచ్‌లు.. 617 పరుగులు.. కొరకరాని కొయ్య ఈ సాయి సుదర్శన్ » 6లో



మిల్కీ బ్యూటీ డ్యాన్స్ కు యూత్ ఫిదా » 5లో



విద్యుత్ ఆటోలకు మనదేశమే అతిపెద్ద విపణి » 4లో



## పాలమూరు, నల్లమల ప్రాంత వాసినని గర్వంగా చెప్పుకొంటా: సీఎం రేవంత్‌రెడ్డి



నల్లమల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచిస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

ఈ కబురు,అమ్రాబాద్: నల్లమల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచిస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పోడు భూములను వ్యవసాయానికి అనుకూలంగా మారుస్తున్నామని చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా 'నల్లమల డిక్లరేషన్'ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. నల్లమల డిక్లరేషన్ ద్వారా గిరిజనుల సంక్షేమానికి రూ.12,600 కోట్లతో పనులు చేపడతామని తెలిపారు. ఒకప్పుడు నల్లమల అంటే వెనుకబడిన ప్రాంతం. ఎవరో ఒక నాయకుడు వచ్చి అభివృద్ధి చేయాలని అనేవారు. సీఎంగా ఇక్కడి నుంచి మాట్లాడుతుంటే నా గుండె ఉప్పొంగిపోతోంది. పాలమూరు, నల్లమల ప్రాంత వాసినని గర్వంగా చెప్పుకొంటా. కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ఈ ప్రాంతం రుణం తీర్చుకుంటున్నా. దేశంలో ఎక్కడ ప్రాజెక్టులు కట్టాలన్నా పాలమూరు వాసులను పిలిచేవారు. ఇక్కడి ప్రజలు కట్టిన ప్రాజెక్టులు నేడు దేశానికి వెన్నెముకగా నిలిచాయి.

» 2లో

» 3లో

## భారత్‌కు వ్యతిరేకంగా పాక్‌కు చైనా సైనిక సాయం చేసిందా..?
### స్పందించిన బీజింగ్



## జమ్ముకశ్మీర్ సమస్యలపై మాట్లాడే అర్హత ఏ ఇతర దేశానికీ లేదు



భారత్, పాకిస్థాన్‌ల మధ్య సంఘర్షణ ఎల్లప్పుడూ సంప్రదాయ విధానంలోనే ఉందని, అణు దాడుల గురించి దాయాది నుంచి ఎటువంటి సంకేతాలు రాలేదని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు.

» 3లో

## జన్ సురాజ్ పార్టీ తొలి జాతీయ అధ్యక్షుడిగా ఉదయ్ సింగ్: ప్రశాంత్ కిశోర్ ప్రకటన

ఎన్నికల ప్రచార వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ కీలక ప్రకటన చేశారు.

ఈ కబురు,పట్నా: ఎన్నికల ప్రచార వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ కీలక ప్రకటన చేశారు. తాను స్థాపించిన రాజకీయ పార్టీకి తొలి జాతీయ అధ్యక్షుడిగా మాజీ ఎంపీ ఉదయ్ సింగ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. పట్నాలో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.

» 2లో



మొదటి పేజీ తరువాయి

# ఇందిర సౌర గిరి జల వికాసం..

## రైతులకు ఉచితంగా సోలార్ పంపుసెట్లు



**ఇందిర సౌర గిరి జల వికాసం' పథకం ప్రారంభోత్సవ సభకు హాజరైన జనం**

పేదల గుండెల్లో ఇందిరమ్మ..

తెల్లదొరలను తరిమేసి దేశానికి స్వేచ్ఛను ప్రసాదించింది కాంగ్రెస్ పార్టీనే. కాంగ్రెస్ ప్రభుత్వమే పేదలకు 25 లక్షల ఎకరాల భూములను పంపిణీ చేసి వారి ఆత్మగౌరవాన్ని పెంచింది. పాకిస్థాన్‌ను ఓడించి బంగ్లాదేశ్ ఏర్పాటుకు ఇందిరాగాంధీ చాకచక్యంగా వ్యవహరించారు. ప్రధాని అంటే ఎలా ఉండాలో తెలియజేశారు. పేదల గుండెల్లో.. తండాల్లో, పల్లెల్లో ఆమె కొలువై ఉన్నారు. అందుకే ఈ పథకానికి ఇందిరమ్మ పేరు పెట్టాం.

వరి వేస్తే ఉరి అన్నచోటే..

అప్పటి ముఖ్యమంత్రి వరి వేస్తే ఉరి అన్నారు.. ఆయన మాత్రం ఫాంహౌస్‌లో 150 ఎకరాల్లో వరిధాన్యం పండించి క్వింటా రూ.4 వేలకు విక్రయించారు. మా ప్రభుత్వం సన్నధాన్యం పండించిన రైతుకు రూ.500 బోనస్ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. రైతులు గత యాసంగిలో 1.56 కోట్ల టన్నులు, వానాకాలంలో 1.35 కోట్ల టన్నుల ధాన్యం పండించారు. ఇప్పుడు ప్రతి నెలా 3.10 కోట్ల మందికి సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నాం. పేదలు మూడు పూటలా కడుపునిండా భోజనం చేస్తున్నారు.

'ఇందిర సౌర గిరి జల వికాసం' లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క

అదానీ, అంబానీలతో మన ఆడబిడ్డల పోటీ..

సౌర విద్యుత్ ఉత్పత్తి అంటే.. అదానీ, అంబానీలకే సాధ్యమని అందరూ అనుకునేవారు. కానీ, వారితోనే పోటీపడేలా మన ఆడబిడ్డల్ని తయారుచేస్తున్నాం. మహిళలు 1,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా ఒప్పందాలు చేసుకున్నాం. వారిని పెట్రోల్ బంకులకు యజమానులను చేశాం. హైదరాబాద్‌లోని శిల్పారామం పక్కన మూడున్నర ఎకరాల్లో అతివలు వారి ఉత్పత్తులను విక్రయించేలా 106 స్టాళ్లు ఏర్పాటు చేశాం. రాబోయే రోజుల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నాం.

దేశంలోనే నంబర్ వన్..

నిత్యావసరాల ధరల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని కేంద్రమే చెప్పింది. శాంతిభద్రతల పరిరక్షణ, పన్నుల వసూలు, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో మొదటిస్థానంలో నిలిచాం. పాలమూరు వారికి పాలన చేతగాదని అవహేళన చేశారు. అయితే, మేం తట్ట, పార పనే కాదు.. పరిపాలన కూడా చేస్తామని ఏడాదిన్నరలోనే నిరూపించా'' అని సీఎం తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి, దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎంపీలు రవి, బలరాంనాయక్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాటామంతీ..

'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకం ప్రారంభించాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లబ్ధిదారులతో మాట్లాడారు. తమ బతుకుల్లో వెలుగులు నింపారంటూ అలివేలు అనే మహిళా రైతు ఆనందం వ్యక్తం చేశారు. తమ పొలంలో దానిమ్మ, అవకాడో, నిమ్మ, కొబ్బరి మొక్కలు నాటామని చెప్పారు. ఏం చదువుకున్నావని అలివేలును సీఎం అడగ్గా.. డిగ్రీ చేశానన్నారు. ఆమెకు గౌరవ వేతనం ఇస్తూ.. చెంచుపెంటల్లో సౌర విద్యుత్, పంపు సెట్లపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఇళ్లు కట్టుకునేందుకు తమకు స్థలాలు లేవని లింగమ్మ అనే మహిళ తెలియజేయగా.. సమస్యను పరిష్కరించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

వారికి ప్రజలే బుద్ధిచెబుతారు..

అక్రమ సంపాదనతో కొందరు మా ప్రభుత్వంపై సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేస్తున్నారు. వారికి ప్రజలే బుద్ధి చెబుతారు. మేం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు, మరో లక్ష ప్రైవేటు ఉద్యోగాలు వచ్చేలా చర్యలు చేపట్టాం. 12 యూనివర్సిటీలకు వీసీలను నియమించాం. ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మిస్తున్నాం. 16 నెలల్లో రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాం.

మొదటి పేజీ తరువాయి

# పాలమూరు, నల్లమల ప్రాంత వాసినని గర్వంగా చెప్పుకొంటా: సీఎం రేవంత్‌రెడ్డి



''ఒకప్పుడు నల్లమల అంటే వెనుకబడిన ప్రాంతం. ఎవరో ఒక నాయకుడు వచ్చి అభివృద్ధి చేయాలని అనేవారు. సీఎంగా ఇక్కడి నుంచి మాట్లాడుతుంటే నా గుండె ఉప్పొంగిపోతోంది. పాలమూరు, నల్లమల ప్రాంత వాసినని గర్వంగా చెప్పుకొంటా. కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ఈ ప్రాంతం రుణం తీర్చుకుంటున్నా. దేశంలో ఎక్కడ ప్రాజెక్టులు కట్టాలన్నా పాలమూరు వాసులను పిలిచేవారు. ఇక్కడి ప్రజలు కట్టిన ప్రాజెక్టులు నేడు దేశానికి వెన్నెముకగా నిలిచాయి. ఇక్కడి రైతులందరికీ ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఇస్తాం. వంద రోజుల్లో సోలార్ విద్యుత్ మోటార్ అందిస్తాం. అచ్చంపేట నియోజకవర్గాన్ని ప్రపంచానికే ఆదర్శంగా మారుస్తాం. దిగ్గజ కంపెనీలతో పోటీపడేలా శిల్పారామం దగ్గర మహిళలకు స్టాళ్లు ఏర్పాటు చేశాం. సన్నబియ్యం లబ్ధిదారుల ఇంటికి స్వయంగా వెళ్లి భోజనం చేసి వచ్చాను. నేడు ప్రతి పేదవాడి ఇంటికీ సన్నబియ్యం అందుతోంది. ఇప్పటి వరకు రైతుల కోసం రూ.60వేల కోట్లు ఖర్చు చేశాం.ప్రధాని అంటే ఇందిరలా ఉండాలనే చర్చ వచ్చింది.. పహల్గాం ఘటన తర్వాత ప్రధాని అంటే ఇందిరాగాంధీలా ఉండాలనే చర్చ వచ్చింది. ఆమె గతంలో పాకిస్థాన్‌తో యుద్ధం చేసి ఆ దేశాన్ని రెండు ముక్కలు చేశారు. 50 ఏళ్ల తర్వాత ఇందిరాగాంధీ పేరు చెప్పుకొంటున్నాం. దేశానికి స్వేచ్ఛనిచ్చిందే కాంగ్రెస్. అందరికీ భూములు ఇచ్చి ఆత్మగౌరవం నింపాలన్నది మా పార్టీ నినాదం. ప్రతి ఆదివాసీ గుండెల్లో ఇందిరమ్మ ఉంటుంది'' అని రేవంత్ అన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలుఅనంతరం సతీమణితో సహా సీఎం రేవంత్‌రెడ్డి కొండారెడ్డిపల్లె శ్రీ ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లారు. అక్కడ సీఎం దంపతులు, మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సభాపతి గడ్డం ప్రసాద్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహా, సీతక్క తదితరులు పాల్గొన్నారు.




# అందాల పోటీలే కాదు..

## అగ్ని ప్రమాదాల మీదా దృష్టిపెట్టాలి: కేటీఆర్

ఈ కబురు,హైదరాబాద్: అందాల పోటీల మీదే కాదు.. అగ్ని ప్రమాదాల మీద కూడా దృష్టి పెట్టాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. అగ్ని ప్రమాదాల్లో మరో ప్రాణం పోకుండా ప్రభుత్వం చూడాలన్నారు. చార్మినార్ పరిధి గుల్జార్‌హౌజ్ సమీపంలో అగ్నిప్రమాదం జరిగిన భవనాన్ని ఆయన పరిశీలించారు. తాను రాజకీయంగా మాట్లాడటానికి ఇక్కడికి రాలేదని చెప్పారు. ప్రభుత్వాలు ప్రజల ప్రాణాలు కాపాడాలని పేర్కొన్నారు.

''రూ.5 లక్షల పరిహారం ఇవ్వడం కాదు.. ప్రాణాలపై దృష్టిపెట్టాలి. మృతుల కుటుంబసభ్యులకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. ముఖ్యమంత్రే హోంమంత్రి కాబట్టి ఘటనా స్థలానికి వస్తే అధికారులు ఇంకా బాగా పనిచేస్తారు. వేసవి కాలం వచ్చే ముందు అగ్నిమాపక సిబ్బందితో ప్రభుత్వం సమీక్ష సమావేశాలు నిర్వహించాలి. అగ్నిమాపక యంత్రాలు వచ్చాయి.. కానీ నీళ్లు లేవు. సిబ్బందికి సరైన మాస్కులు లేవని తెలిసింది. అంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్ లేకపోవడం దురదృష్టకరం. హైదరాబాద్‌లో ఇదే అత్యంత భారీ అగ్ని ప్రమాదం. నిన్నటిరోజు దుర్భరమైన రోజు.. బాధితులు, మృతుల కుటుంబ సభ్యుల ఆవేదన వర్ణనాతీతం'' అని కేటీఆర్ తెలిపారు.



# మద్యం ధరలు పెంచి ఖజానా నింపుకొంటారా?

మద్యం ద్వారా వచ్చే ఆదాయంలో తెలంగాణను నంబర్ 1 చేస్తారా? ఇదేనా మీరు చెబుతున్న తెలంగాణ రైజింగ్ అంటే? అంటూ మండిపడ్డారు. మద్యం ధరల పెంపును ఖండిస్తూ ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ''పాలన గాలికి వదిలి, సంక్షేమ పథకాలను అటకెక్కించి.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువగా ఎక్సర్‌సైజ్ చేస్తున్నది ఒక్క ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌పైనే. భారాస ప్రభుత్వం ఉన్నప్పుడు మద్యంపై రాద్ధాంతం చేసిన వాళ్లే.. ఇప్పుడు వాటి ధరలు పెంచి రూ.వేల కోట్ల రాబడిని సమకూర్చుకోవాలనుకోవడం సిగ్గుచేటు. ఇప్పటికే బీర్ల ధరలను పెంచిన ప్రభుత్వం.. ఇప్పుడు ఇతర లిక్కర్ ధరలు పెంచుతూ పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తోంది. అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్షీణిస్తుంటే.. ఆ లోటును పూడ్చేందుకు మద్యం ధరలు పెంచడం మీకే చెల్లింది. మద్యం నియంత్రణ విషయంలో ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ఒక్క హామీనైనా ఇప్పటివరకు అమలు చేశారా? ఎక్సైజ్ విధానాన్ని పరిశీలించి, సవరించడమంటే.. ధరలను అడ్డగోలుగా పెంచడమేనా? రాష్ట్రాన్ని తాగుబోతుల తెలంగాణ చేసి భార్యాపిల్లలను రోడ్లపై పడేస్తారా? యువత బతుకులను ఆగం చేస్తారా?'' అని హరీశ్ ధ్వజమెత్తారు.

మొదటి పేజీ తరువాయి

# కాళేశ్వరం ఆనకట్టల విచారణ కమిషన్ గడువు పొడిగింపు




మరో రెండు నెలలపాటు గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జులై నెలాఖరు వరకు గడువు పెంచుతున్నట్లు పేర్కొంది. ఇటీవల ఈ కమిషన్ విచారణను పూర్తి చేసింది. త్వరలోనే ప్రభుత్వానికి నివేదికను అందించనుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన లోపాలు, వైఫల్యాలపై గతేడాది నుంచి విచారణ జరిపింది. బ్యారేజీల డిజైన్, నిర్మాణం, నాణ్యత, నిర్వహణ అంశాలపై విచారించింది. సాంకేతిక, ఆర్థిక, విధానపరమైన అంశాలపై ఇంజినీర్లు, ఉన్నతాధికారులు, ఇతరులను ప్రశ్నించింది. వారి నుంచి అఫిడవిట్లు తీసుకొని వాటి ఆధారంగా క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది.

మొదటి పేజీ తరువాయి

# 60 ఏళ్ల తర్వాత ఇజ్రాయెల్‌కు 'గూఢచారి' వస్తువులు





**'ఎలి కోహెన్‌ను ఉరితీసిన 60 ఏళ్ల తర్వాత నేను నాడియా కోహెన్‌ను కలిశాను. కోహెన్ వస్తువులను తీసుకొచ్చేందుకు మొస్సాద్ ఒక ప్రత్యేకమైన ఆపరేషన్ నిర్వహించింది. దాదాపు 2,500 వస్తువులను తిరిగి తీసుకొచ్చాం. అందులో కోహెన్‌కు సంబంధించిన వ్యక్తిగత వస్తువులు, ఆయన స్వయంగా రాసిన లేఖలు ఉన్నాయి. కోహెన్ ఒక హీరో. ఒక గొప్ప గూఢచారి. మా బందీలను తీసుకొచ్చేందుకు మేము అవిశ్రాంతంగా శ్రమిస్తాం' అని నెతన్యాహు పేర్కొన్నారు. ఈసందర్భంగా కోహెన్ మృతదేహాన్ని తిరిగి తీసుకురావాలని నాడియా నెతన్యాహుని కోరారు.**

**ఎవరీ ఎలి కోహెన్..**

**ఎలి కోహెన్ ఇజ్రాయెల్‌కు చెందిన గూఢచారి. 1960లో సిరియాలోని రాజకీయ, సైనిక వ్యవహారాల్లో ఎలి కోహెన్ సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకున్నాడు. ఆ తర్వాత సిరియా రక్షణ మంత్రికి అగ్ర సలహాదారుడిగా ఎదిగాడు. 1965లో ఇజ్రాయెల్‌కు రేడియో ద్వారా సమాచారం పంపుతూ సిరియన్ నిఘా సంస్థలకు పట్టుబడ్డాడు. కొన్ని రోజుల విచారణ అనంతరం అదే ఏడాది మే 18న డమాస్కస్‌లో అతడిని ఉరితీశారు. అతడి మృతదేహాన్ని ఇప్పటివరకు ఇజ్రాయెల్‌కు అప్పగించలేదు. అయితే, కోహెన్‌ను టెల్‌అవీవ్‌లో హీరోగా పరిగణిస్తారు. కోహెన్ పట్టుబడిన అనంతరం సిరియన్ నిఘా సంస్థలు ఆయనకు సంబంధించిన అనేక వస్తువులను స్వాధీనం చేసుకున్నాయి. అందులో పలు కీలక పత్రాలు, రికార్డింగ్‌లు, ఫొటోలు, వ్యక్తిగత వస్తువులు, ఇజ్రాయెల్‌లోని అతని కుటుంబానికి రాసిన లేఖలు ఉన్నాయి. వీటన్నింటినే తాజాగా టెల్‌అవీవ్ సొంతం చేసుకుంది. ఇక, గతవారం నాలుగు దశాబ్దాలుగా కనిపించకుండాపోయిన ఇజ్రాయెల్‌కు చెందిన ఓ సైనికుడి మృతదేహాన్ని సిరియా నుంచి టెల్‌అవీవ్ స్వాధీనం చేసుకుంది. అతడు 1982లో లెబనాన్-సిరియా దళాల మధ్య జరిగిన ఘర్షణల్లో మరణించినట్లు తెలుస్తోంది.**

# పాక్ టార్గెట్‌లో గోల్డెన్ టెంపుల్..

## గీత కూడా పడనివ్వని భారత ఆర్మీ



మన ఆపరేషన్ తర్వాత పాక్ దాడులకు పాల్పడుతుందని భారత సైన్యం అంచనా వేసింది. మిలిటరీ టార్గెట్లతో పాటు పౌరులకు చెందిన సదుపాయాలు, మతపరమైన ప్రాంతాలపై రెచ్చగొట్టే చర్యలు ఉండొచ్చని ఊహించింది. ''పాక్‌కు ఎలాంటి కచ్చితమైన లక్ష్యాలు లేవని తెలుసు. గోల్డెన్ టెంపుల్‌ను లక్ష్యంగా చేసుకొనే అవకాశాలు కనిపించాయి. ముందుగానే ఊహించడంతో దానికి అదనపు రక్షణ కల్పించాం. పూర్తిగా సిద్ధమయ్యాం. మన ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ గన్నర్స్.. పాకిస్థాన్ సైన్యం ప్రణాళికలను తిప్పికొట్టారు. మన స్వర్ణ దేవాలయంపై ఒక్క గీత కూడా పడకుండా అన్ని డ్రోన్లు, క్షిపణులను కూల్చివేశారు'' అని మేజర్ జనరల్ వెల్లడించారు.

'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత సైన్యం పాక్‌లోని ఉగ్ర స్థావరాలపై విరుచుకుపడిన విషయం తెలిసిందే. ఈ మెరుపు దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు చనిపోయారు. దాంతో వందలాదిగా పాక్ డ్రోన్స్, మిసైల్స్‌ను భారత్‌పై ప్రయోగించింది. మన ఎస్400, ఆకాశ్ తదితర మన గగనతల రక్షణ వ్యవస్థలు అద్భుతరీతిలో వాటిని నేలమట్టం చేశాయి. వాటిని ఎక్కడికక్కడ కూల్చేశాయి. దానికి సంబంధించిన వీడియోను వెస్ట్రన్ కమాండ్ పోస్టు చేసిన సంగతి తెలిసిందే. ఇక పాక్ డ్రోన్లు, మిస్సైళ్ల శకలాలు చెల్లాచెదురుగా పడిన వీడియోలు పెద్దఎత్తున సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన సంగతి తెలిసిందే.

# జన్ సురాజ్ పార్టీ తొలి జాతీయ అధ్యక్షుడిగా

## ఉదయ్ సింగ్: ప్రశాంత్ కిశోర్ ప్రకటన

ఈ కబురు,పట్నా: ఎన్నికల ప్రచార వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ కీలక ప్రకటన చేశారు. తాను స్థాపించిన రాజకీయ పార్టీకి తొలి జాతీయ అధ్యక్షుడిగా మాజీ ఎంపీ ఉదయ్ సింగ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. పట్నాలో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఇకపై తాను ప్రజలకు చేరువయ్యే అంశంపై దృష్టిసారించనున్నట్లు తెలిపారు. పార్టీని నడిపించే బాధ్యతను ఉదయ్‌సింగ్, ఆర్‌సీపీ సింగ్...తదితర నేతలకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. గతంలో నిలిచిపోయిన తన పాదయాత్రను మంగళవారం నుంచే పునఃప్రారంభించనున్నట్లు ఈ సందర్భంగా ప్రశాంత్ కిశోర్ ప్రకటించారు. గతేడాది అక్టోబర్ 2న ప్రశాంత్ కిశోర్ జన్ సురాజ్ పార్టీని ప్రారంభించారు. అప్పటి నుంచి ఆ పార్టీ పూర్తిస్థాయి అధ్యక్షుడు లేకుండానే పనిచేస్తోంది. తాను ఏ పదవినీ ఉంచుకోనంటూ గతంలోనే స్పష్టం చేసిన ప్రశాంత్ కిశోర్.. పార్టీ ఏర్పాటైన వెంటనే మాజీ ఐపీఎస్ అధికారి మనోజ్ భారతిని జన్ సురాజ్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ప్రకటించిన విషయం తెలిసిందే.




# తెలంగాణలో మరో నాలుగు రోజుల పాటు వర్షా లు

ఈ కబురు,హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పాడిన ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మరో నాలుగు రోజులపాటు తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు తెలిపింది. నేడు కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణ్‌పేట్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ, గద్వాల్ జిల్లాల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాల్లో ఎల్లో అలర్ట్స్ జారీ చేసింది. వర్షాల కారణంగా ఎండ తీవ్రత తగ్గనుంది. పగటిపూట ఉష్ణోగ్రతలు ఐదు డిగ్రీల మేర తగ్గే అవకాశముంది.చురుగ్గా నైరుతి రుతుపవనాలుబంగాళాఖాతం, అరేబియా సముద్రంలో నైరుతి రుతుపవనాలు మరింత వేగంగా విస్తరిస్తున్నాయి.రెండు మూడు రోజుల్లో దక్షిణ అరేబియా, మాల్దీవులు, కొమోరిన్ సహా బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయి. మరోవైపు మధ్య మహారాష్ట్ర సహా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ వరకు 0.9 కి.మీ ఎత్తులో ఓ ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా కర్ణాటక వరకు మరో ద్రోణి కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రానున్న 24 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో కొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. మరోవైపు అంచనా వేసిన సమయానికంటే ముందుగానే రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశమున్నట్లు భారత వాతావరణశాఖ వెల్లడించింది. ప్రస్తుతం అండమాన్ నికోబార్ దీవుల్లో రుతుపవనాలు పూర్తిగా విస్తరించి ఉన్నాయి. తొలుత ఈ నెల 27న కేరళ తీరాన్ని తాకుతాయని ఐఎండీ అంచనా వేసింది. అయితే, కాస్త ముందుగా 24నే కేరళ తీరంలోకి ప్రవేశించి, జూన్ మొదటి వారంలోనే తెలంగాణలోకి ప్రవేశించే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# చందానగర్ స్టేడియంలో ఉత్సహంగా

## కొనసాగుతున్న వేసవి శిక్షణా శిబిరం



పిజెఆర్ స్టేడియం క్రికెట్ కోచ్ రవి



పిజెఆర్ స్టేడియం సమ్మర్ క్యాంప్ లో శిక్షణ తీసుకుంటున్న చిన్నారులు



పిజెఆర్ స్టేడియం సమ్మర్ క్యాంప్ లో శిక్షణ తీసుకుంటున్న చిన్నారులు

**అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో శిక్షణ : కోచ్ రవి**

ఈకబురు, శేరిలింగంపల్లి : గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా జీహెసీ ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలు ఉత్సాహం గా సాగుతున్నాయి. చందానగర్ పీజేఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరానికి స్థానికంగా ఉన్న యువత తరలివస్తున్నారు. స్కూల్స్ కు సెలవులు కావడంతో చిన్నారులు తమకు నచ్చిన క్రీడల్లో సత్తా చాటేందుకు శిక్షణ తీసుకుంటున్నారు. చందానగర్ స్టేడియంలో క్రికెట్, అథ్లెటిక్స్, స్కేటింగ్, బాస్కెట్ బాల్, కరాటే, బాక్సింగ్, యోగా, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్ తదితర క్రీడల్లో చిన్నారులకు కోచ్ లు శిక్షణ అందిస్తున్నారు. ఈ సమ్మర్ క్యాంప్ లు చిన్నారులకు ఆటలపై ఆసక్తి పెంచడంతో పాటు వారిని శారీరకంగా, మానసికంగా దృడంగా రూపొందించనున్నాయి. గతంలో చందానగర్ పీజేఆర్ స్టేడియంలో శిక్షణ పొందిన క్రీడాకారులు ప్రస్తుతం రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు సైతం వేసవి శిక్షణా శిబి రాలలో తమ పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. పీజేఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరాలలో క్రికెట్ పట్ల చిన్నా రులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. క్రికెట్ కోచింగ్ కోసం భారీగా చిన్నారులు వస్తుండడంతో.. కోచ్ రవి చిన్నారులను పలు బ్యాచ్ లుగా విభజించి కోచింగ్ ఇస్తున్నారు.

**ఉత్తమ ప్రమాణాలతో శిక్షణ : క్రికెట్ కోచ్ రవి**

చందానగర్ పిజెఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ కు హాజరవుతున్న చిన్నారులకు వారి అభిరుచికి అనుగుణంగా శిక్షణ ఇస్తున్నామని క్రికెట్ కోచ్ రవి తెలిపారు. ముఖ్యంగా పీజేఆర్ స్టేడియంలో క్రికెట్ కోచింగ్ తీసుకుంటున్న చిన్నారులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరిలో ఉన్న ప్రత్యేక టాలెంట్ ను గుర్తించి, అందుకు అనుగుణంగా బ్యాటింగ్, బౌలింగ్, కీపింగ్ విభాగాల్లో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా చిన్నారులకు క్రికెట్ మేలుకువలను నేర్పిస్తున్నామన్నారు. పీజేఆర్ స్టేడియంలో శిక్షణ తీసుకున్న క్రీడాకారులు ఎంతోమంది నేడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం భారత క్రికెట్ జట్టుకు ఆడుతున్న తిలక్ వర్మ చందానగర్ పీజేఆర్ స్టేడియం నుంచే తన ప్రస్థానాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు.

# జమ్ముకశ్మీర్ సమస్యలపై మాట్లాడే అర్హత ఏ ఇతర దేశానికీ లేదు



**భారత్, పాకిస్థాన్‌ల మధ్య సంఘర్షణ ఎల్లప్పుడూ సంప్రదాయ విధానంలోనే ఉందని, అణు దాడుల గురించి దాయాది నుంచి ఎటువంటి సంకేతాలు రాలేదని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు.**

ఈ కబురు: భారత్, పాకిస్థాన్‌ల మధ్య సంఘర్షణ ఎల్లప్పుడూ సంప్రదాయ విధానంలోనే ఉందని, అణు దాడుల గురించి దాయాది నుంచి ఎటువంటి సంకేతాలు రాలేదని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు. భారత్‌పాక్ ఉద్రిక్తతలు, ఆపరేషన్ సిందూర్ గురించి విదేశీ వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘానికి మిస్రీ వివరించారు. కాల్పుల విరమణ నిర్ణయం ద్వైపాక్షిక స్థాయిలోనే తీసుకున్నారని పునరుద్ఘాటించారు. ఈ వ్యవహారంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాదనలను కొంతమంది ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తగా.. మిస్రీ ఈమేరకు స్పందించారు. ''పహల్గామ్ దాడి ఘటనపై దర్యాప్తులో కీలక వివరాలు వెల్లడయ్యాయి. పాక్‌లోని సూత్రధారులతో ఉగ్రవాదులు సంభాషించినట్లు దర్యాప్తులో తేలింది. ఉగ్రవాదులు పాక్‌లో స్వేచ్ఛగా తిరుగుతున్నారు. భారత్‌పై హింసను ప్రేరేపిస్తున్నారు. పాక్ సీమాంతర ఉగ్రవాదం గురించి భారత్ ఆందోళన చెందుతోంది. జమ్ముకశ్మీర్ సమస్యలపై మాట్లాడే అర్హత ఏ ఇతర దేశానికీ లేదు'' అని విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు

# పాక్ అనుకూల ప్రచారం వ్యాప్తి కోసం.. జ్యోతి మల్హోత్రాకు ఆదేశాలు..!



**పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తోందన్న ఆరోపణలపై అరెస్టయిన హరియాణా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను అధికారులు విచారిస్తున్నారు. అయితే ఆమె ముఖంలో ఎలాంటి పశ్చాత్తాపం కనిపించలేదట!**

ఈ కబురు: పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తూ అరెస్టయిన హరియాణా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసు విచారణలో పలు కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. విచారణ సమయంలో ఆమెలో ఎటువంటి పశ్చాత్తాపం కనిపించలేదని సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ 'ఇండియాటుడే' కథనం రాసుకొచ్చింది. పైగా ఆమె తన వాక్ స్వాతంత్ర్యాన్ని వినియోగించుకుంటున్నట్లు చెప్పిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. పాకిస్థాన్ అనుకూల ప్రచారాన్ని వ్యాప్తి చేయాలని ఆమెకు ఆదేశాలు వచ్చాయని, ఇదో కొత్త తరహా యుద్ధమని వెల్లడించాయి. ఇక పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఆమె యూట్యూబ్‌లో ఒక వీడియోను పోస్టు చేసింది. ఆ ఘటనకు ఏ పాకిస్థాన్ వ్యక్తి తప్పులేదని అందులో పేర్కొందని తెలుస్తోంది. జ్యోతితో పరిచయం ఉన్న కొందరు పాక్ వ్యక్తులు.. ఆమెకు అదనపు పనులు అప్పగించారని, ఆ దిశగా విచారణ జరుగుతోందని తెలిపాయి.గూఢచర్యం ఆరోపణల కింద గతవారం జ్యోతి ని హరియాణా పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటికే ఆమె గురించి అనేక విషయాలు బయటికొచ్చాయి. పహల్గాం దాడికి ముందు ఆమె పలుమార్లు పాకిస్థాన్‌లో పర్యటించిందని, ఒకసారి చైనాకూ వెళ్లొచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. 'ఆపరేషన్ సిందూర్' అనంతరం నెలకొన్న ఉద్రిక్తతల సమయంలో ఆమె దిల్లీలోని పాక్ రాయబార కార్యాలయంలోని అధికారి డానిష్‌తో టచ్‌లో ఉన్నట్లు నిర్ధరించారు. జ్యోతిని అతడు ట్రాప్ చేసినట్లు గుర్తించారు. ఇక పహల్గాం ఘటనకు ముందు ఆమె ఆ ప్రాంతానికి వెళ్లి అక్కడ వీడియోలు తీసినట్లు సమాచారం. ఆ సమాచారాన్ని పాక్ ఏజెంట్లకు చేరవేసి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు. దీనిపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ట్రావెల్ బ్లాగర్, యూట్యూబర్ అయిన జ్యోతి మల్హోత్రా ట్రావెల్ విత్ జో పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తోంది. ఇప్పటికే ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను కూడా భారత్‌లో నిలిపివేశారు.

# గాజా మొత్తాన్ని స్వాధీనం చేసుకుంటాం:

## నెతన్యాహు సంచలన వ్యాఖ్యలు



**గాజా భూభాగాన్ని మొత్తం తమ నియంత్రణలోకి తీసుకుంటామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వెల్లడించారు.**

ఈ కబురు: గాజా మొత్తాన్ని తమ అధీనంలోకి తీసుకుంటామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వెల్లడించారు. ఇజ్రాయెల్ హమాస్ ల మధ్య ఉద్రిక్తతల వేళ గాజాలో మరోసారి దాడుల తీవ్రతను పెంచిన నేపథ్యంలో ప్రధాని నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. దౌత్య కారణాలకు లోబడి గాజాలో క్షామాన్ని నివారించాల్సి అవసరాన్ని తాము గుర్తించామని చెప్పారు. ''మా పోరాటం తీవ్రస్థాయిలో ఉంది. మేం పురోగతి సాధిస్తున్నాం. ఆ ప్రాంతం మొత్తాన్ని నియంత్రణలోకి తీసుకుంటాం. ఇందులో వెనక్కి తగ్గేదేలేదు. విజయం సాధించాలంటే.. మనల్ని అడ్డుకోలేరనే విధంగా వ్యవవహరించాలి'' అని టెలిగ్రామ్ వేదికగా నెతన్యాహు ఒక వీడియోను పోస్టు చేశారు.
మరోసారి ఇజ్రాయెల్ గాజాపై దాడుల తీవ్రతను పెంచింది. శనివారం అర్ధరాత్రి నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్న పలు నివాసాలు, శిబిరాలపై వైమానిక దాడులు జరిపింది. ఖాన్‌యూనిస్‌లో 29 మంది, ఉత్తర గాజాలో 48 మంది, జబాలియాలోని శరణార్థి శిబిరంలో 26మంది.. మొత్తంగా 103 మంది మరణించారని స్థానిక ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపునకు హమాస్ అంగీకరించని కారణంగానే దాడులను తీవ్రం చేసినట్లు ఇటీవల నెతన్యాహు వెల్లడించిన సంగతి తెలిసిందే.తాజాగా గాజాలోని రెండో అతి పెద్ద నగరమైన ఖాన్ యూనిస్, సమీప ప్రాంతాలను ఖాళీ చేయాలని స్థానిక ప్రజలకు ఇజ్రాయెల్ మిలిటరీ తాజాగా ఆదేశాలు ఇచ్చింది. వాటిని ప్రమాదకరమైన పోరాట ప్రాంతాలుగా పరిగణిస్తున్నట్లు పేర్కొంది. మరోవైపు దోహాలో జరుగుతున్న చర్చల్లో హమాస్ బహిష్కరణ అంశాన్ని ఇజ్రాయెల్ తెరపైకి తీసుకొచ్చిందని తెలుస్తోంది. యుద్ధం శాశ్వతంగా ఆగాలంటే గాజా పాలన నుంచి హమాస్ వైదొలగాలని, ఆయుధాలు అప్పగించాలని, ఆ సంస్థ ఉగ్రవాదులంతా ఇతర దేశాలకు వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ డిమాండ్ చేస్తోంది. అయితే గాజా నుంచి వెళ్లడానికి, ఆయుధాల అప్పగింతకు తాము సిద్ధంగా లేమని హమాస్ చెప్పినట్లు తెలుస్తోంది. ఇటీవల పశ్చిమాసియా పర్యటనకు వెళ్లిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. గాజా గురించి కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. గాజాలోని పాలస్తీనియన్లు ఖాళీ చేయాలని గతంలో ప్రతిపాదించిన ట్రంప్.. దానిని అమెరికా నియంత్రణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ''గాజా ఫొటోలను చూశాను. అక్కడ ఒక్క భవనమూ లేదు. అన్నీ కుప్పకూలాయి. ఆ శిథిలాల కిందే ప్రజలు ఉంటున్నారు. ఇది అంగీకారయోగ్యం కాదు. గాజాను అమెరికా తీసుకోవాలని అనుకుంటున్నాను. స్వేచ్ఛా మండలంగా దాన్ని మలచాలి. గాజాకు సంబంధించి నాకు మంచి ఆలోచనలు ఉన్నాయి'' అని పేర్కొన్నారు.

# భారత్‌కు వ్యతిరేకంగా పాక్‌కు చైనా సైనిక సాయం చేసిందా..? స్పందించిన బీజింగ్

**ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాకిస్థాన్‌కు చైనా సహాయంపై పలు ప్రశ్నలు తలెత్తాయి. దీనిపై తాజాగా చైనా నుంచి స్పందన వచ్చింది.**

ఈ కబురు: భారత్‌పాక్ ఇటీవలి ఉద్రిక్తతల సమయంలో ఇస్లామాబాద్‌కు చైనా సైనిక సహాయం అందించిందా..? మీడియా నుంచి ఇదే ప్రశ్న ఎదురుకాగా.. ఆ దేశ విదేశాంగశాఖ ప్రతినిధి మావోనింగ్ సమాధానం ఇచ్చారు. ''భారత్‌పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటి నుంచి చైనా తటస్థ వైఖరిని కొనసాగించింది. రెండు దేశాలు సంయమనం పాటించాలని పిలుపునిచ్చింది. ఇరు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి మద్దతు ఇచ్చాం. శాశ్వత కాల్పుల విరమణను ప్రోత్సహించడంలో, ప్రాంతీయ సుస్థిరత కోసం నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాం'' అని మావోనింగ్ వెల్లడించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించిన సంగతి తెలిసిందే. పీఓకే, పాక్‌లోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. అధునాతన గగనతల రక్షణ వ్యవస్థలు తమ వద్ద ఉన్నాయని, భారత వైమానిక, క్షిపణి దాడులను అవి అడ్డుకుంటాయని కలలుగన్న పాకిస్థాన్‌కు చుక్కెదురైంది. చైనా నుంచి సమీకరించిన హెచ్‌క్యూ9, ఎల్‌వై80 వ్యవస్థలు, వాటి రాడార్లు.. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ ప్రయోగించిన ఒక్క క్షిపణినీ ఆపలేకపోయాయి. ఆపరేషన్ సిందూర్‌లో భారత క్షిపణులు తక్కువ ఎత్తులో, సూపర్‌సోనిక్ వేగంతో దూసుకెళ్లాయి. దీనివల్ల పాక్ రాడార్లు వాటిని పసిగట్టలేకపోయాయని భావిస్తున్నారు.
ఆ ఆపరేషన్‌ను జీర్ణించుకోలేని పాకిస్థాన్.. చైనాకు చెందిన పీఎల్ 15, తుర్కియేకు చెందిన , సొంగార్ డ్రోన్లతో మన వైమానిక స్థావరాలను టార్గెట్ చేయాలని ప్రయత్నించి విఫలమైంది. కాగా.. ఈ ఉద్రిక్తతల సమయంలో పాక్‌కు అనుకూలంగా చైనా వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. సవాళ్లతో కూడిన పరిస్థితుల్లోనూ పాకిస్థాన్ సంయమనంతో ఉందని, బాధ్యతాయుత విధానాన్ని అవలంబించిందని చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యీ దాయాదితో చెప్పినట్లు వార్తలు వచ్చాయి. సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడంలో ఆ దేశానికి అండగా నిలుస్తామని వాంగ్‌యీ పేర్కొన్నారు. ఈ తరుణంలోనే చైనా సహాయం గురించి ఆరోపణలు వచ్చాయి.



# ఇండోనేసియాలో బద్దలైన అగ్నిపర్వతం.... 6 కి.మీ. ఎత్తుకు ఎగసిన బూడిద

**ఇండోనేసియాలోని లెవోటోబి లకి-లకి అగ్నిపర్వతం బద్ధలైంది.**

ఈ కబురు,పడాంగ్: తూర్పు ఇండోనేసియాలోని లెవోటోబి లకిలకి అగ్నిపర్వతం సోమవారం బద్ధలైంది. ఫ్లోర్స్ దీవిలోని మౌంట్ లెవొటోబి లకిలకిలో విస్ఫోటనాలు ఏర్పడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అగ్నిపర్వతం నుంచి దాదాపు 6 కి.మీ ఎత్తుకు మందంపాటి బూడిద ఎగసిపడుతున్నట్లు తెలిపారు. సమీప గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని.. మాస్కులు ధరించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

''అగ్నిపర్వతం విస్ఫోటనం చెందడంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. త్వరగా గ్రామాలను ఖాళీ చేయించి, అక్కడి నివాసితులను ఇతర ప్రాంతాలకు తరలించడానికి చర్యలు తీసుకుంటున్నాం'' అని వోల్కనాలజీ అండ్ జియోలాజికల్ హజార్డ్ మిటిగేషన్ అధికారులు పేర్కొన్నారు. అగ్నిపర్వతంలో బూడిద ఇప్పటికీ ఎగసిపడుతోందని.. పెద్ద మొత్తంలో మరిన్ని విస్ఫోటనాలు సంభవించే అవకాశం ఉందని ఇండోనేసియా జియోలాజికల్ ఏజెన్సీ అధిపతి ముహమ్మద్ వాఫిద్ పేర్కొన్నారు. ఈ సమయంలో వర్షాలు పడితే అగ్నిపర్వతం చుట్టూ ఉన్న ప్రాంతాలకు సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని అన్నారు.



# అగ్ని ప్రమాదంలో నష్టపోయారా?: ఇన్సూరెన్స్ క్లెయిమ్ ప్రాసెస్






**అసలే వేసవి కాలం.. భానుడి భగభగలు భారీగా ఉన్నాయి. ఇలాంటి సమయంలోనే సాధారణంగా అగ్ని ప్రమాదాలు, షార్ట్ సర్క్యూట్‌లు జరుగుతుంటాయి. ఇటీవల హైదరాబాద్ పాతబస్తీలోని 'గుల్జార్‌హౌస్'లో జరిగిన అగ్ని ప్రమాదంలో.. ప్రాణ నష్టంతోపాటు ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదం ఘటనపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణం ఏమిటనేది స్పష్టంగా వెల్లడికావాల్సి ఉంది. కాగా, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు సంబంధీకుల ప్రాణనష్టాన్ని ఎలాగో పూడ్చలేరు. కానీ ఆస్తి నష్టాన్ని ముందుగానే తీసుకున్న ఇన్సూరెన్స్ ద్వారా కొంత భర్తీ చేయవచ్చు. ఇలాంటి సందర్భంలో బీమా ఎలా క్లెయిమ్ చేయాలో నిపుణులు సూచిస్తున్నారు.**

### ఫైర్ ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేయడం ఎలా

బీమా కంపెనీకి సమాచారం అందించాలి: అగ్నిప్రమాదం జరిగిన వెంటనే మీ బీమా ప్రొవైడర్‌కు సమాచారం ఇవ్వండి. అవసరమైతే, అత్యవసర ఖర్చుల కోసం ముందస్తు ఆర్థిక సహాయాన్ని అభ్యర్థించండి. సంఘటన జరిగిన తేదీ, సమయం, స్థలం వంటి ముఖ్యమైన వివరాలను అందించడంతో పాటు.. ఎంత నష్టం జరిగిందో అంచనా వేయండి.

నష్టాన్ని డాక్యుమెంట్ చేయండి: అగ్నిప్రమాదం జరిగిన తరువాత.. స్థలాన్ని శుభ్రపరచడానికి ముందు.. అక్కడ పరిసరాలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు తీయండి. కాలిన వస్తువులను పారవేయకూడదు. భీమా కంపెనీ స్పందించడానికి ముందే.. రిపేర్ చేయడం వంటి చేయకూడదు.క్లెయిమ్ ఫైల్ చేయండి: ఫైర్ ఇన్సూరెన్స్ క్లెయిమ్ ఫారాన్ని ఆన్‌లైన్‌లో లేదా బీమా కంపెనీ కార్యాలయంలో సబ్మిట్ చేయండి. మీ ఫైర్ ఇన్సూరెన్స్ పాలసీ కాపీ, నష్టాన్ని తెలియజేసే ఫోటోలు & వీడియోలు, పాడైపోయిన వస్తువుల జాబితా.. వాటి విలువను తెలిపే రసీదులు లేదా ఇన్వాయిస్‌లు, ఫైర్ బ్రిగేడ్ నివేదిక వంటి అవసరమైన డాక్యుమెంట్స్ అందించాల్సి ఉంటుంది.

సర్వేయర్‌తో సహకరించండి: ఇన్సూరెన్స్ కంపెనీ నష్టాన్ని అంచనా వేయడానికి ఒక సర్వేయర్‌ను నియమిస్తుంది. సర్వేయర్‌కు పూర్తిగా సహకరించండి. వారికి అవసరమైన సమాచారం & పత్రాలను అందించండి. నష్టపోయిన ఆస్తిని పరిశీలించడానికి వారికి అనుమతి ఇవ్వండి.

క్లెయిమ్ సెటిల్మెంట్: మీ క్లెయిమ్ ఆమోదం పొందిన తరువాత.. పాలసీ నిబంధనల ప్రకారం నష్టపరిహారం కంపెనీ చెల్లిస్తుంది. అయితే చెల్లింపు విధానం గురించి సంస్థ మీకు తెలియజేస్తుంది.

గమనించండి: ఈ దశలు సాధారణ మార్గదర్శకాలు మాత్రమే. మీ నిర్దిష్ట పాలసీ, ఇన్సూరెన్స్ కంపెనీ విధానాలు కొద్దిగా మారవచ్చు. కాబట్టి, మీ పాలసీ డాక్యుమెంట్‌లను జాగ్రత్తగా చదవండి. మీకు ఏవైనా సందేహాలు ఉంటే మీ ఇన్సూరెన్స్ ప్రొవైడర్‌ను సంప్రదించండి.

# సుప్రీంలో టెల్కోలకు షాక్.. వొడాఫోన్ ఐడియా షేర్లు డౌన్

**వొడాఫోన్ ఐడియా షేర్లు నేడు ఇంట్రాడేలో 10 శాతం నష్టపోయాయి. ఏజీఆర్ బకాయిల పిటిషన్‌ను తిరస్కరించడమే దీనికి కారణం.**

టెలికాం సంస్థలకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. సర్దుబాటు చేసిన స్థూల రాబడి బకాయిల నుంచి ఊరట కల్పించాలంటూ టెలికాం కంపెనీలు దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కోర్టు తిరస్కరించింది. దీంతో వొడాఫోన్ ఐడియా షేర్లు కుప్పకూలాయి. ఇంట్రాడేలో వీఐ షేర్లు 10 శాతం మేర క్షీణించాయి. ఏజీఆర్ బకాయిలపై వడ్డీ, పెనాల్టీలు, పెనాల్టీలపై వడ్డీ నుంచి తమకు మినహాయింపు కల్పించాలని టెలికాం సంస్థలు వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్‌టెల్, టాటా టెలీ సర్వీసెస్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. తీవ్ర అప్పుల ఊబిలో కూరుకుపోయిన తాము మనుగడ సాధించాలంటే ఏజీఆర్ బకాయిలకు సంబంధించి రూ. 45వేల కోట్లు మాఫీ చేయాలని తొలుత వొడాఫోన్ ఐడియా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఎయిర్‌టెల్ కూడా ఇదే తరహా పిటిషన్ వేసింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ నిర్ణయంతో టెలికాం సంస్థలపై భారం పడనుందన్న భయంతో షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. ఈ వార్తల నేపథ్యంలో మార్కెట్లు ముగిసే సమయానికి వీఐ షేర్లు 8.41 శాతం నష్టంతో, ఎయిర్‌టెల్ 0.14 శాతం లాభంతో ముగిశాయి. సుప్రీంకోర్టుకు వొడాఫోన్ ఐడియా దాఖలు చేసిన పిటిషన్‌లో రూ.83,400 కోట్లను ఏజీఆర్ బకాయిలుగా పేర్కొంది. ఇందులో రూ.12,797 కోట్లు ప్రిన్సిపల్, రూ.28,294 కోట్ల వడ్డీ, రూ.6,012 కోట్ల జరిమానా, రూ.11,151 కోట్ల జరిమానాలపై వడ్డీ ఉన్నాయని పేర్కొంది. ఇటీవల రూ.36,950 కోట్ల స్పెక్ట్రమ్ బకాయిలను, ఈక్విటీగా మార్చుకోవడంతో వొడాఫోన్ ఐడియాలో ప్రభుత్వం వాటా 48.99 శాతానికి చేరింది. అంతకు ముందు కంపెనీలో ప్రభుత్వానికి 22.6 శాతం వాటా ఉండేది. ఇక భారతీ ఎయిర్‌టెల్, దాని అనుబంధ సంస్థ భారతీ హెక్సాకామ్ ఏజీఆర్ కింద అసలు రూ.9,235 కోట్లు చెల్లించాల్సి ఉంది. వడ్డీ రూ.21,850 కోట్లు, జరిమానాలు రూ.3,995 కోట్లు, జరిమానాలపై వడ్డీ రూ.8,900 కోట్లు కలిపితే ఈ మొత్తం రూ.43,980 కోట్లకు చేరుకుందని ఎయిర్‌టెల్ దాఖలు తన పిటిషన్‌లో తెలిపింది.




# మరింత ఖరీదైన బంగారం.. నేడు తులం..



దేశంలో బంగారం ధరలు మళ్లీ ఎగిశాయి. రెండు రోజులు నిలకడగా ఉన్న పసిడి ధరలు నేడు (మే 19) మరోసారి పెరుగుదల బాట పట్టాయి. దీంతో ఈరోజు కొనుగోలుదారులు కాస్త ఎక్కువ మొత్తం వెచ్చించాల్సి ఉంటుంది. మే 19 నాటికి దేశంలోని ప్రధాన నగరాల్లో 24 క్యారెట్, 22 క్యారెట్ బంగారం ధరలు ఈ విధంగా ఉన్నాయి..

తెలుగు రాష్ట్రాల్లో..
24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.95,510
22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.87,550

హైదరాబాద్, విజయవాడ సహా తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో బంగారం ధరలు స్థిరంగా ఉన్నప్పటికీ, స్థానిక జ్యువెలరీ షాపుల్లో మేకింగ్ ఛార్జీలు,జీఎస్టీ కారణంగా కొంత వ్యత్యాసం కనిపిస్తుంది. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు నేడు వరుసగా రూ.380, రూ.350 పెరిగాయి.

ఇది చదివారా? ఈ దేశాలు బంగారానికి పుట్టిళ్లు..!!

చెన్నైలో..
24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.95,510
22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.87,550

చెన్నైలో బంగారం ధరలు ఇతర నగరాలతో పోలిస్తే కొంచెం ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ పోర్ట్ సౌకర్యాలు, డిమాండ్ ఈ ధరలను ప్రభావితం చేస్తున్నాయి. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు నేడు వరుసగా రూ.380, రూ.350 పెరిగాయి.

ఢిల్లీలో..
24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.95,660
22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.87,700

ఢిల్లీలో బంగారం ధరలు రవాణా ఖర్చులు, స్థానిక ట్యాక్స్‌ల కారణంగా కొంత ఎక్కువగా ఉన్నాయి. అయితే ఈ నగరంలో బంగారం కొనుగోలుదారులు హాల్‌మార్క్ ఆభరణాలపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు నేడు వరుసగా రూ.380, రూ.350 పెరిగాయి.

ముంబైలో..
24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.95,510
22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.87,550

ముంబైలో బంగారం ధరలు స్థానిక డిమాండ్, జ్యువెలరీ డిజైన్‌లపై ఆధారపడి మారుతూ ఉంటాయి. ఈ నగరంలో బంగారం కొనుగోలు చేసే ముందు పలు జ్యువెలరీ షాపుల ధరలను సరిపోల్చడం మంచిది. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు నేడు వరుసగా రూ.380, రూ.350 పెరిగాయి.

బెంగళూరులో..
24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.95,510
22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.87,550

బెంగళూరులో బంగారం ధరలు స్థిరంగా ఉన్నాయి, కానీ స్థానిక ఆర్థిక పరిస్థితులు, ఫెస్టివల్ సీజన్ డిమాండ్ ఈ ధరలను ప్రభావితం చేయవచ్చు. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు నేడు వరుసగా రూ.380, రూ.350 పెరిగాయి.

వెండి ధరలూ..
దేశవ్యాప్తంగా వెండి ధరల్లో కూడా నేడు పెరుగుదల నమోదైంది. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో నిన్నటితో పోలిస్తే ఈరోజు వెండి కేజీకి రూ.1000 పెరిగి రూ.1,08,000 వద్దకు చేరింది. అలాగే ఢిల్లీ ప్రాంతంలోనూ రూ.1000 ఎగిసి రూ. 98,000 లను తాకింది.

# యూకో బ్యాంక్ మాజీ సీఎండీ అరెస్ట్: కారణం ఇదే..



యూకో బ్యాంక్ మాజీ సీఎండీ 'సుబోధ్ కుమార్ గోయెల్'ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్ చేసింది. బ్యాంకు రుణ మోసం కేసులో.. మనీలాండరింగ్ ఆరోపణలపై ఈయనను అరెస్ట్ చేసినట్లు ఈడీ వెల్లడించింది. కాన్‌కాస్ట్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ కు రుణాల మంజూరులో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో సుబోధ్ కుమార్ గోయెల్‌ను అరెస్ట్ చేసి కోల్‌కతాలోని ప్రత్యేక మనీలాండరింగ్ నిరోధక చట్టం కోర్టు ముందు ఏదీ హాజరుపరచింది. కాగా యూకో బ్యాంక్ మాజీ సీఎండీని మే 21 వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కస్టడీకి పంపినట్లు ఫెడరల్ దర్యాప్తు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. యూకో బ్యాంక్ సీఎండీగా గోయెల్ పనిచేసిన సమయంలో కాన్‌కాస్ట్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ కు భారీ మొత్తంలో నిధులను మంజూరు చేశారు. ఇలా మంజూరైన రూ. 6,210.72 కోట్ల నిధులను ఆ సంస్థ దుర్వినియోగం చేసిందని.. సీబీఐ దర్యాప్తులో తెలిసింది. అంతే కాకూండా ఋణ మంజూరు విషయంలో.. సుబోధ్ కుమార్ గోయెల్‌ను ముడుపులు అందినట్లు కూడా సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.

# విద్యుత్ ఆటోలకు మనదేశమే అతిపెద్ద విపణి

**వరుసగా రెండో ఏడాదీ విద్యుత్ త్రిచక్ర వాహనాల (ఆటో)కు ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్‌గా మనదేశం నిలిచింది. 2024లో విద్యుత్ ఆటోల విక్రయాలు దాదాపు 20% పెరిగి 7 లక్షలకు చేరాయని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఈఏ) గ్లోబల్ ఈవీ ఔట్‌లుక్-2025 నివేదికలో వెల్లడించింది.**

ఐఈఏ నివేదిక

దిల్లీ: వరుసగా రెండో ఏడాదీ విద్యుత్ త్రిచక్ర వాహనాల (ఆటో)కు ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్‌గా మనదేశం నిలిచింది. 2024లో విద్యుత్ ఆటోల విక్రయాలు దాదాపు 20% పెరిగి 7 లక్షలకు చేరాయని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఈఏ) గ్లోబల్ ఈవీ ఔట్‌లుక్2025 నివేదికలో వెల్లడించింది. అంతర్జాతీయ విద్యుత్ త్రిచక్ర వాహన విపణిలో ఎక్కువ భాగం వృద్ధి, భారత్ నుంచే వస్తోందని తెలిపింది. గతేడాది అంతర్జాతీయంగా ఆటో మార్కెట్ 5% తగ్గినా, విద్యుత్ ఆటోల విక్రయాలు మాత్రం 10% పెరిగి 10 లక్షలకు చేరాయి. మొత్తం ఆటోల విక్రయాల్లో విద్యుత్ విభాగ వాటా దాదాపు 25 శాతానికి చేరింది. 2023లో ఇది అయిదింట ఒకవంతుగా ఉంది. మొత్తం త్రిచక్రవాహన విక్రయాల్లో చైనా, భారత్ వాటా 90 శాతం కంటే అధికంగా ఉంది.





# ఓటీటీలోకి హిట్ 3 ..

## త్వరలో స్ట్రీమింగ్

నాని లేటెస్ట్ హిట్ చిత్రం హిట్ 3 శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కి మే 1 న థియేటర్స్ లో రిలీజ్ అయ్యి బిగ్ హిట్ అయ్యింది. పాన్ ఇండియా మూవీ గా మే 1 న రిలీజ్ అయిన హిట్ 3కి లాంగ్ వీకెండ్ కలిసొచ్చింది. రెండు వారాలు తిరిగే లోపే హిట్ 3 100 కోట్ల క్లబ్బులోకి సునాయాసంగా అడుగుపెట్టింది. హిట్ ఫ్రాంచైజీతో సూపర్ హిట్స్ కొడుతున్న నానిశైలేష్ కొలను ద్వయం హిట్ 3 తోనూ భారీ హిట్ కొట్టారు. థియేటర్స్ లో హిట్ అయిన ఈ చిత్ర ఓటీటీ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్ ఫ్లిక్స్ ఫ్యాన్సీ డీల్ తో సొంతం చేసుకుంది. ఇక ఈ చిత్రం థియేటర్స్ లో మిస్ అయిన వారు ఎప్పుడెప్పుడు ఓటీటీలో వీక్షిద్దామా అని కాచుకుని కూర్చున్నారు. అయితే హిట్ 3 జూన్ 5 నుంచి థియేటర్స్ విడుదలైన అన్ని భాషల నుంచి స్ట్రీమింగ్ లోకి తెచ్చేందుకు నెట్ ఫ్లిక్స్ రెడీ అయ్యింది. సో జూన్ 5 నుంచి హిట్ 3 ఓటీటీ ఆడియన్స్ ముందుకు వచ్చేస్తుంది. మరి మిస్ అవ్వకుండా చూసెయ్యండి.


# మిల్కీ బ్యూటీ డ్యాన్స్ కు యూత్ ఫిదా

స్టార్ హీరోయిన్, మిల్కీ బ్యూటీ తమన్నా కెరీర్ లో దూసుకుపోతున్నారనే చెప్పాలి. భాషతో సంబంధం లేకుండా బాలీవుడ్, టాలీవుడ్ సహా ఇతర సినీ ఇండస్ట్రీల్లో వ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. రీసెంట్ గా ఓదెల-2 మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చి అమ్మడు... తన యాక్టింగ్ తో మెప్పించారు. ఇప్పుడు పలు సినిమాల్లో యాక్ట్ చేస్తున్నారు. అదే సమయంలో హీరోయిన్ గా నటిస్తూనే.. అడపాదడపా స్పెషల్ సాంగ్స్ లో తళుక్కున మెరుస్తున్నారు మిల్కీ బ్యూటీ. ఇప్పటికే ఆమె చేసిన స్పెషల్ సాంగ్స్.. ఓ రేంజ్ లో హిట్ అయ్యాయి. సోషల్ మీడియాలో ఇప్పటికీ ట్రెండింగ్ లోనే ఉన్నాయి. సినిమా ఏదైనా స్పెషల్ సాంగ్ అంటే తమన్నానే చేయాలనేంతలా పాపులారిటీ సంపాదించుకుంది. ఏ సాంగ్ అయినా.. తన డ్యాన్స్ స్కిల్స్, ఎక్స్ప్రెషన్స్ తో ఆడియన్స్ ను కట్టిపడే టాలెంట్ ఆమె సొంతం. ఇప్పుడు ఆమె డ్యాన్స్ చేసిన ఓ సాంగ్ వీడియో సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ గా మారింది. రీసెంట్ గా ఓ ఈవెంట్ లో తమన్నా.. పలు సాంగ్స్ తో మెప్పించారు. తన డ్యాన్స్ తో ఓ రేంజ్ లో సందడి చేశారని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. గ్రీన్ కలర్ మోడ్రన్ డ్రెస్ లో హీట్ పుట్టించే లుక్స్ తో.. తన ఎక్స్ప్రెషన్స్ తో మైమరపించింది తమన్నా. ఎవర్ గ్రీన్ హిట్ సాంగ్ కజరారేకు అయితే అదరగొట్టేసిందని చెప్పాలి. మొత్తానికి తమన్నా వీడియోస్ నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి. దీంతో నెటిజన్లు ఫుల్ గా రెస్పాండ్ అవుతున్నారు. దుమ్ముదులిపేశారని కామెంట్స్ పెడుతున్నారు. డ్యాన్స్ స్కిల్స్ సూపర్ అని.. ఎక్స్ప్రెషన్స్ వేరే లెవెల్ అని అనేక మంది నెటిజన్లు కొనియాడుతున్నారు. లైక్ కొట్టి వీడియోస్ ను ఇంకా వైరల్ చేస్తున్నారు. లుక్ అదిరిపోయిందని చెబుతున్నారు. ఏ సాంగ్ అయినా.. తమన్నా ఫ్లాట్ చేయడం పక్కా అని అంటున్నారు. మోస్ట్ టాలెంటెడ్ హీరోయిన్ అని తమన్నాను ఆకాశానికెత్తేస్తున్నారు.



# త్వరలో ముల్క్ సీక్వెల్

*విభిన్న కథలను ఎంచుకుంటూ ఆడియన్స్ ను అలరిస్తూ వస్తున్న తాప్సీ పన్ను నుంచి 2018లో వచ్చిన ముల్క్ సినిమా ఎంత మంచి టాక్ ను తెచ్చుకుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కోర్టు రూమ్ డ్రామాగా వచ్చిన ఈ సినిమాలో తాప్సీ తో పాటూ రిషి కపూర్ కూడా నటించి ఆ సినిమాను మరింత రక్తి కట్టించి ఆడియన్స్ ను మరింత ఆకట్టుకున్నారు. ఇప్పుడు ముల్క్ సినిమాకు సీక్వెల్ గా ముల్క్2 రాబోతుంది. ముల్క్ సినిమాకు దర్శకత్వం వహించిన అనుభవ్ సిన్హానే ఈ సీక్వెల్ కు కూడా దర్శకత్వం వహిస్తున్నాడు. ముల్క్ సినిమాలానే ఈ సినిమా కూడా ఐడెంటిటీ, విశ్వాసం, పౌర హక్కులకు సంబంధించిన అంశాలను మరోసారి లోతుగా పరిశీలిస్తుందని చిత్ర యూనిట్ హామీ ఇస్తోంది. బోల్డ్ క్యారెక్టర్లను ఎంచుకుని తన పవర్‌ఫుల్ నటనతో ఎంతో ప్రఖ్యాతి చెందిన తాప్సీ, మరోసారి ముల్క్ 2లో అద్భుతమైన పెర్ఫార్మెన్స్ చేసే అవకాశముందని తెలుస్తోంది.*



# మహేష్ బాబు మరదలుకు కోవిడ్ !



మరోసారి కోవిడ్ కేసులు ప్రపంచ వ్యాస్తంగా వెలుగు చూస్తున్నాయి. హాంకాంగ్ సింగపూర్ లో మళ్లీ కోవిడ్ -19మహమ్మారి కేసులు వెలుగు చూడగా.. క్రమంగా భారత్ లోనూ కోవిడ్ కలవరం మొదలైంది. హీరో మహేష్ బాబు సతీమణి నమ్రత సోదరి శిల్పా శిరోద్కర్‌కు కోవిడ్ పాజిటివ్ గా నిర్ధారణ అయ్యింది. ఈ మేరకు శిల్పా ఎక్స్ లో పోస్టు చేశారు. మిత్రులారా నాకు కొవిడ్ పాజిటివ్ గా తేలిందని.. మీరు జాగ్రత్తగా ఉండండి..మాస్కులు ధరించండి అని పోస్టు చేసింది. శిల్పా పోస్టు చూసిన నెటిజన్లు, సినీ ప్రముఖులు ఆమెకు ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అటు సోదరి నమ్రత కూడా శిల్ప త్వరగా కోలుకోవాలని లవ్ ఎమోజీలతో రిప్లై ఇచ్చింది. సోనాక్షి సిన్హా, సోనాలి బింద్రే, డయానా పాండే తదితరులు కూడా శిల్పా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కాగా కోవిడ్-19 వ్యాక్సినేషన్ పొందిన మొదటి భారతీయ సిని పరిశ్రమ నటిగా శిల్పా శిరోద్కర్ గుర్తింపు పొందారు. ఆమె మరోసారి కోవిడ్ పాజిటివ్ గా తేలడం విస్మయం రేపింది. ప్రస్తుతం హాంకాంగ్, సింగపూర్ లలో కోవిద్ తో పాటు అడినో వైరస్, రైనో వైరస్ కూడా విస్తరిస్తున్నాయి. రోజుకు 2వేల వరకు కేసులు నమోదవుతున్నాయి. థాయిలాండ్, చైనాలలోనూ కోవిడ్ విస్తరిస్తుంది. చైనాలోని కొన్ని ప్రాంతాల్లో లాక్ డౌన్ చర్యలు అమలు చేస్తున్నారు. ప్రస్తుతం విస్తరిస్తున్న కోవిడ్ వైరియస్ ఓమిక్రాన్ అనుబంధ వేరియంట్లలో ఒకటిగా చూస్తున్నారు. కొత్త వేరియంట్లపై స్పష్టత రావాల్సిఉంది. ఏది ఏమైనా మాస్కులు, శానిటైజేషన్ వంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం మంచిందంటున్నారు నిపుణులు.



# పెళ్లి తర్వాత పెరిగిన అందం

హీరోయిన్ కీర్తి సురేష్ గత ఏడాది డిసెంబర్ లో వివాహం చేసుకుంది. తన చిన్ననాటి స్నేహితుడు ఆంటోనీని హిందూ, క్రిష్టియన్ సంప్రదాయంలో వివాహం చేసుకుంది. ఆతర్వాత కూడా కీర్తి సురేష్ సోషల్ మీడియాలో హీటెక్కించే ఫొటోస్ వదులుతూ చాల యాక్టీవ్ గా కనిపించింది. హిందీలో బేబీ జాన్ తర్వాత మరో క్రేజీ ప్రాజెక్ట్ కీర్తి సురేష్ ని వరించింది అనే న్యూస్ ఉంది. మరోపక్క కొద్దిరోజులుగా సోషల్ మీడియాకి గ్యాప్ ఇచ్చిన కీర్తి సురేష్ తాజాగా దుబాయ్ డైరీస్ అంటూ కిర్రాక్ లుక్ లో అదిరిపోయే ఫోటోలకు ఫోజులిచ్చింది. రెడ్ సిల్క్ శారీ లో స్లీవ్ లెస్ బ్లౌజ్ తో కీర్తి సురేష్ బ్యూటిఫుల్ లుక్ లో కనిపించింది. వివాహం అయ్యాక మరింత బ్రైట్ గా వెలిగిపోతున్న కీర్తి సురేష్ గ్లామర్ లుక్స్ మాత్రం యూత్ ని దాటిపోవట్లేదు. ఒకప్పుడు బొద్దుగా కనబడిన కీర్తి సురేష్ ఇప్పుడు స్లిమ్ గా మారిపోయింది. నాజూకైన గ్లామర్ తో మత్తెక్కిస్తుంది. క్రేజీ గ్లామర్ తో అందరి చూపు తనవైపు ఉండేలా చూసుకోవడంలో సక్సెస్ అవుతుంది.

# సన్‌రైజర్స్‌కు నాలుగో విజయం.. ప్లే ఆఫ్స్ రేసు నుంచి లఖ్‌నవ్ ఔట్



**6 వికెట్లతో సూపర్ జెయింట్స్‌పై హైదరాబాద్ గెలుపు**

**206 పరుగుల లక్ష్యాన్ని 18.2 ఓవర్లలో ఛేదన**

**ప్లే ఆఫ్స్ రేసు నుంచి లక్నో అవుట్**

**చెలరేగిన అభిషేక్ శర్మ, క్లాసెన్**

లక్నో: ఈ ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆట ఇదివరకే ముగిసింది. తాజాగా లక్నో సూపర్ జెయింట్స్‌పై గెలిచి వారి 'ప్లే ఆఫ్స్' ఆశల్ని కూడా ముంచింది. సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 6 వికెట్ల తేడాతో లక్నోపై జయభేరి మోగించింది. ముందుగా లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. మిచెల్ మార్ష్ (39 బంతుల్లో 65; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు),

మార్‌క్రమ్ (38 బంతుల్లో 61; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), పూరన్ (26 బంతుల్లో 45; 6 ఫోర్లు, 1 సిక్స్) దంచేశారు. ఇషాన్ మలింగకు 2 వికెట్లు దక్కాయి. తర్వాత సన్‌రైజర్స్ 18.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 206 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అభిషేక్ శర్మ (20 బంతుల్లో 59; 4 ఫోర్లు, 6 సిక్స్‌లు), క్లాసెన్ (28 బంతుల్లో 47; 4 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగారు. దిగ్వేశ్ రాఠి 2 వికెట్లు తీశాడు. సెంచరీ భాగస్వామ్యం

మిచెల్ మార్ష్ దూకుడుతో లక్నో ఆట మొదలైంది. కమిన్స్ తొలి బంతికి 4, నాలుగో బంతికి 6 కొట్టాడు. ఇదే జోరుతో హర్ష్ దూబె రెండో ఓవర్లో మార్ష్ మరో సిక్స్ బాదాడు. మూడో ఓవర్లో బౌండరీతో మార్‌క్రమ్ టచ్‌లోకి వచ్చాడు. నాలుగో ఓవర్ తొలి బంతికే మార్‌క్రమ్ అవుటవ్వాల్సింది. క్రీజు వదిలి ఆడిన అతన్ని ఇషాన్ కిషన్ స్టంపౌట్ చేయలేకపోయాడు. ఇలా బతికిపోయిన మార్‌క్రమ్ 6, 4లతో రెచ్చిపోయాడు. దీంతో ఆ ఓవర్లో 17 పరుగులు వచ్చాయి.

మార్ష్ దంచే పనిలో ముందున్నాడు. హర్షల్, ఇషాన్ మలింగ ఓవర్లలో భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. దీంతో ఓపెనింగ్ జోడీ పవర్‌ప్లేలో 69 పరుగులు చేసింది. కాసేపటికే మార్ష్ 28 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. 9వ ఓవర్లో మార్‌క్రమ్‌కు మరోమారు లైఫ్ వచ్చింది. జీషాన్ బౌలింగ్‌లో ఇచ్చిన సులువైన క్యాచ్‌ను డీప్ ఎక్స్‌ట్రా కవర్‌లో అనికేత్ వదిలేశాడు. దీంతో అదే ఓవర్లో లక్నో 100 పరుగులు దాటింది. తర్వాత ఎట్టకేలకు మార్ష్ వికెట్ తీసిన హర్ష్ దూబె 115 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెర దించాడు. లక్నో కెప్టెన్ రిషభ్ పంత్ (7) ఎక్కువసేపు నిలువలేదు. ఇషాన్ రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు. రెండు లైఫ్‌లను సద్వినియోగం చేసుకున్న మార్‌క్రమ్ 28 బంతుల్లో ఫిఫ్టీని పూర్తి చేసుకున్నాడు. పూరన్ మధ్యలో పడిపోయిన రన్‌రేట్ పెంచేందుకు బ్యాట్ ఝుళిపించాడు. హర్షల్ 16వ ఓవర్లో సిక్స్ బాదిన మార్‌క్రమ్ అదే ఓవర్లో బౌల్డయ్యాడు. నితీశ్ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో భారీ సిక్సర్ బాదిన పూరన్‌తో పాటు శార్దుల్ (4)కూడా రనౌటయ్యారు. సమద్ (3)ను బౌల్డ్ చేయగా... ఆకాశ్‌దీప్ (6) సిక్స్‌తో జట్టు స్కోరు 200 దాటింది. 20వ ఓవర్లో నితీశ్ 20 పరుగులిచ్చాడు.

**అభిషేక్ అదరహో**

రెండు ఓవర్లలో సన్‌రైజర్స్ స్కోరు 23/1. అప్పటికి అభిషేక్ ఒక పరుగే చేశాడు. ఆకాశ్‌దీప్ మూడో ఓవర్ నుంచి అతని విధ్వంసం మొదలైంది. 4, 6 బాదిన అభిషేక్ తర్వాతి రూర్కే ఓవర్లోనూ దీన్ని రిపీట్ చేశాడు. దీంతో 3.3 ఓవర్లోనే జట్టు స్కోరు 50కి చేరింది. అవేశ్ ఖాన్ బౌలింగ్‌కు దిగితే వరుస బౌండరీలతో జోరు కనబరచడంతో పవర్‌ప్లేలో హైదరాబాద్ 72/1 స్కోరు చేసింది. ఆ తర్వాత ఓవర్ వేసిన రవి బిష్ణోయ్‌కి అభిషేక్ చుక్కలు చూపించాడు. 6, 6, 6, 6లతో 26 పరుగులు రాబట్టాడు. మూడో సిక్స్ బాదేసరికే 18 బంతుల్లో అతని ఫిఫ్టీ పూర్తయ్యింది. మరుసటి ఓవర్లో అభిషేక్ జోరుకు దిగ్వేశ్ రాఠి బ్రేక్ వేశాడు. ఈ సందర్భంగా రాఠి, అభిషేక్ మాటామాట పెంచుకున్నారు. అంపైర్లు సముదాయించి పంపారు. 35 బంతుల్లోనే 82 పరుగుల ధనాధన్ రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత ఇషాన్ కిషన్ (28 బంతుల్లో 35; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), క్లాసెన్‌లు ధాటిని కొనసాగించడంతో సన్‌రైజర్స్ లక్ష్యంవైపు దూసుకెళ్లింది. కిషన్ అవుటయ్యాక 'దంచే'పనిని క్లాసెన్, కమిందు మెండిస్ (21 బంతుల్లో 32 రిటైర్డ్‌హర్ట్; 3 ఫోర్లు) చక్కబెట్టారు. స్వల్ప వ్యవధిలో ఇద్దరు పెవిలియన్‌కు చేరినా... మిగతా లాంఛనాన్ని అనికేత్ (0 నాటౌట్), నితీశ్ రెడ్డి (0 నాటౌట్) పూర్తి చేశారు.

**స్కోరు వివరాలు**

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: మార్ష్ (సి) మలింగ (బి) హర్ష్ 65; మార్‌క్రమ్ (బి) హర్షల్ 61; పంత్ (సి అండ్ బి) మలింగ 7; పూరన్ (రనౌట్) 45; బదోని (సి) నితీశ్ (బి) మలింగ 3; సమద్ (బి) నితీశ్ 3; శార్దుల్ (రనౌట్) 4; బిష్ణోయ్ (నాటౌట్) 0; ఆకాశ్‌దీప్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 205. వికెట్ల పతనం: 1-115, 2-124, 3-159, 4-169, 5-194, 6-199, 7-199.

బౌలింగ్: కమిన్స్ 4-0-34-0, హర్ష్ దూబె 4-0-44-1, హర్షల్ పటేల్ 4-0-49-1, ఇషాన్ మలింగ 4-0-28-2, జీషాన్ అన్సారి 2-0-22-0, నితీశ్ 2-0-28-1.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అథర్వ తైడే (సి) దిగ్వేశ్ (బి) రూర్కే 13; అభిషేక్ (సి) శార్దుల్ (బి) దిగ్వేశ్ 59; కిషన్ (బి) దిగ్వేశ్ 35; క్లాసెన్ (సి) పంత్ (బి) శార్దుల్ 47; కమిందు (రిటైర్డ్‌హర్ట్) 32; అనికేత్ (నాటౌట్) 5; నితీశ్ రెడ్డి (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 10; మొత్తం (18.2 ఓవర్లలో 4 వికెట్లకు) 206.

వికెట్ల పతనం: 1-17, 2-99, 3-140, 4-195.

బౌలింగ్: ఆకాశ్‌దీప్ 3-0-33-0, రూర్కే 2.2-0-31-1, దిగ్వేశ్ రాఠి 4-0-37-2, అవేశ్ ఖాన్ 3-0-25-0, రవి బిష్ణోయ్ 1-0-26-0, మార్‌క్రమ్ 1-0-14-0, శార్దుల్ 4-0-39-1.



# 12 మ్యాచ్‌లు.. 617 పరుగులు..

## కొరకరాని కొయ్య ఈ సాయి సుదర్శన్



**ఈ ఐపీఎల్‌లో గుజరాత్ ఆటగాడు సాయి సుదర్శన్ అదరగొడుతున్నాడు. నిలకడగా ఆడుతూ జాతీయ జట్టులోకి వచ్చేలా ప్రభావం చూపిస్తున్నాడు.**

ఐపీఎల్ లో ఎంతోమంది అంతర్జాతీయ సూపర్ స్టార్లున్నారు. కానీ, వాళ్లందరినీ వెనక్కి నెట్టి దేశవాళీ ఆటగాడు సాయి సుదర్శన్ అత్యధిక పరుగుల వీరుడిగా కొనసాగుతున్నాడు. విరాట్ కోహ్లి సహా చాలామంది స్టార్ బ్యాటర్ల నుంచి గట్టి పోటీ ఎదురవుతున్నా.. సుదర్శన్ తగ్గట్లేదు. కొరకరాని కొయ్యలా ఎవరికీ సాధ్యం కాని నిలకడతో దూసుకెళ్తున్నాడు. తమిళనాడుకి చెందిన సాయి సుదర్శన్ ఇప్పటిదాకా ఆడిన ఐపీఎల్ మ్యాచ్‌లు 37. వాటిలో 27 మ్యాచ్‌ల్లో 30 ప్లస్ స్కోర్లు చేయడం విశేషం. ఐపీఎల్ చరిత్రలో మరే ఆటగాడికీ సాధ్యం కాని ఘనత ఇది. అతనెంత నిలకడగా ఆడుతున్నాడో చెప్పడానికి ఈ ఒక్క గణాంకం చాలు. టీ20 క్రికెట్లో అత్యంత వేగంగా 2 వేల పరుగుల మైలురాయిని అందుకున్న భారత బ్యాటర్‌గా అతను ఇటీవలే రికార్డు నెలకొల్పాడు. అతడికిది 54వ ఇన్నింగ్స్ మాత్రమే. అంతర్జాతీయ క్రికెట్లో ఒక్క షాన్ మార్ష్ (54 ఇన్నింగ్స్‌లు) అతడి కంటే ముందున్నాడు.

ఐపీఎల్‌లో సాయి సుదర్శన్ గణాంకాలు చూస్తే నమ్మశక్యం కానట్లుగా ఉంటాయి. 37 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో అతను 50.03 సగటుతో 1651 పరుగులు సాధించాడు. అందులో రెండు శతకాలు, 11 అర్ధశతకాలున్నాయి. ఐపీఎల్ పునః ప్రారంభం తర్వాత ఆడిన తొలి మ్యాచ్‌లోనే అతను అజేయ శతకం సాధించాడు. ఆదివారం దిల్లీపై ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చి 61 బంతుల్లోనే 108 పరుగుల అజేయ ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. అతడి ధాటికి 200 పరుగుల లక్ష్యం తేలికైపోయింది. సుదర్శన్ ఆట చూస్తే నెమ్మదిగా సాగుతున్నట్లు అనిపిస్తుంది కానీ... తన స్ట్రైక్ రేట్ 145కు పైనే కావడం విశేషం. ఈ ఎడమ చేతి వాటం బ్యాటర్ ఇప్పటిదాకా 163 ఫోర్లు, 51 సిక్సర్లు బాదాడు. ప్రస్తుత సీజన్‌లో సుదర్శన్ 12 మ్యాచ్‌ల్లో 56కు పైగా సగటుతో 617 పరుగులు సాధించిన టాప్ స్కోరర్‌గా కొనసాగుతుండడం విశేషం.

2022లో ఐపీఎల్‌లోకి అడుగు పెట్టిన తొలి సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ సుదర్శన్‌ను ఎంచుకుంది. కానీ, మొదట్లో అతడికి తుది జట్టులో అవకాశాలు రాలేదు. సీజన్ మధ్యలో ఛాన్స్ ఇస్తే బాగా ఉపయోగించుకున్నాడు. 5 మ్యాచ్‌ల్లో 145 పరుగులతో జట్టు కప్పు గెలవడంలో తన వంతు పాత్ర పోషించాడు. దీంతో తర్వాతి సీజన్ నుంచి గుజరాత్ అతణ్ని రెగ్యులర్‌గా తుది జట్టులో ఆడిస్తోంది. శుభ్‌మన్ గిల్ లాంటి మేటి బ్యాటర్‌కు సుదర్శన్ లాంటి నిలకడైన ఆటగాడు తోడవడంతో ఐపీఎల్‌లోనే బెస్ట్ ఓపెనింగ్ జోడీ గుజరాత్‌దే అయింది. ఈ సీజన్‌లో గుజరాత్ దూసుకెళ్తుండడానికి ఈ జోడీనే ప్రధాన కారణం. ఇద్దరూ పోటీపడి పరుగులు సాధిస్తూ జట్టుకు శుభారంభాలందిస్తున్నారు. మూడో స్థానంలో ఆడే జోస్ బట్లర్ కూడా నిలకడగా రాణిస్తుండడంతో గుజరాత్ పని తేలికైపోతోంది. మిడిలార్డర్‌కు పెద్దగా పనే ఉండట్లేదు. సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లోనూ సుదర్శన్ 48 పరుగుల మెరుపు ఇన్నింగ్స్‌తో జట్టుకు శుభారంభాన్నిచ్చాడు. సుదర్శన్ టీ20 క్రికెట్‌కు అవసరమైన దూకుడును ప్రదర్శిస్తాడు కానీ.. చాలామంది కుర్రాళ్ల లాగా అడ్డదిడ్డంగా షాట్లు ఆడడు. ఎక్కువగా గ్రౌండ్ షాట్లకే ప్రాధాన్యమిస్తాడు. గాల్లోకి బంతి లేపాడంటే గ్యాప్‌లో అయినా వెళ్లాలి. లేదా స్టాండ్స్‌లో అయినా పడాలి. వికెట్‌కు ఎంతో విలువ ఇస్తూ నిలకడగా పరుగులు సాధిస్తూ లీగ్‌లో మేటి బ్యాటర్లలో ఒకడిగా ఎదుగుతున్నాడు.

**పిలుపు రాబోతోందా?**

సుదర్శన్ ఆట సునీల్ గావస్కర్, రవిశాస్త్రి లాంటి మాజీలు చాలామందిని ఆకట్టుకుంది. అతణ్ని టీమ్ ఇండియాలోకి తీసుకోవాలన్న డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి. మెరుగైన టెక్నిక్ ఉన్న సుదర్శన్.. అవసరమైనప్పుడు దూకుడుగానూ ఆడగలడు. సుదీర్ఘ ఇన్నింగ్స్‌లు ఆడగల నైపుణ్యం ఉందతడికి. సుదర్శన్ మూడు ఫార్మాట్లకూ సరిపోయే ఆటగాడని రవిశాస్త్రి కితాబిచ్చాడు. ఐపీఎల్ తర్వాత ఇంగ్లాండ్ పర్యటనకు అతణ్ని ఎంపిక చేయాలని అతను సూచించాడు.

"సుదర్శన్ ఒక క్లాస్ ప్లేయర్. అతడికి మూడు ఫార్మాట్లలోనూ ఆడగలిగే సత్తా ఉంది. ఎడమ చేతి వాటం బ్యాటర్ కావడం, మెరుగైన టెక్నిక్ ఉండడం సుదర్శన్‌ను ఇంగ్లాండ్‌తో సిరీస్ రేసులోకి తీసుకొచ్చాయి" అని రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్‌లో ఓ మోస్తరు ప్రదర్శన చేసిన కుర్రాళ్లకు కూడా టీమ్ ఇండియాలో అవకాశాలు వచ్చాయి. అలాంటిది సుదర్శన్ ఇంత నిలకడగా రాణించాక అతడికి ఛాన్సివ్వక తప్పదు. అతను ఇప్పటికే టీమ్ ఇండియాలోకి రావాల్సిందనే అభిప్రాయాలున్నాయి. అతను వచ్చే నెల తొలి వారంలో ఇంగ్లాండ్ లయన్స్‌తో నాలుగు రోజుల మ్యాచ్‌లో భారత్‌ఎ తరఫున ఆడబోతున్నాడు. ఆ తర్వాత అతడికి ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ ఆడే భారత జట్టులోనూ చోటు దక్కడం లాంఛనమే కావచ్చు.




# పంజాబ్ రూపురేఖల్నే మార్చి.. 11 ఏళ్ల తర్వాత ప్లేఆఫ్స్‌నకు చేర్చి.. ఒకేఒక్కడు శ్రేయస్

యస్ అయ్యర్ సారథ్యంలో పంజాబ్ కింగ్స్ దూసుకెళ్తోంది. 11 ఏళ్ల తర్వాత తొలిసారి ప్లేఆఫ్స్‌లోకి ఆ జట్టు చేరింది.

ఎలాంటి అంచనాలు లేని జట్టు అది. నిలకడలేమికి మారు పేరుగా ఉండేది. ఎప్పుడూ పేలవ ప్రదర్శనతో కనీసం ప్లేఆఫ్స్ వరకు రాకుండానే వెనుదిరుగుతుండేది. అలాంటి జట్టు అద్భుత ప్రదర్శనతో 11 ఏళ్ల తర్వాత ప్లేఆఫ్స్‌లోకి సగర్వంగా అడుగుపెట్టింది. అందుకు కారణం ఒకే ఒక్కడు.. అతడే శ్రేయస్ అయ్యర్ .. ఆ జట్టే పంజాబ్ కింగ్స్ .తరచూ కెప్టెన్లు మారుతుండే జట్టు పంజాబ్. అలాంటి జట్టులోకి వచ్చాడు శ్రేయస్ అయ్యర్. సారథ్య బాధ్యతలు చేపట్టి.. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆ జట్టు రూపురేఖలనే మార్చివేశాడు. అటు బ్యాట్‌తో, ఇటు కెప్టెన్సీతో ఆకట్టుకుంటూ.. తన జట్టును అద్భుతంగా ముందుకు నడిపిస్తున్నాడు. ఇప్పటివరకు ఆడిన 12 మ్యాచ్‌ల్లో 8 విజయాలను నమోదు చేసింది ఆ జట్టు.సారథిగా ఒకేఒక్కడు.. ఇక ఏ జట్టుకు సారథ్య బాధ్యతలు వహించినా.. తనదైన వ్యూహాలతో అద్భుతంగా ముందుకునడిపిస్తాడు శ్రేయస్. ఐపీఎల్ చరిత్రలో ఇప్పటి వరకూ మూడు వేర్వేరు జట్లకు సారథ్యం వహించి వాటిని ప్లేఆఫ్స్‌నకు చేర్చిన ఏకైక కెప్టెన్ శ్రేయస్ అయ్యరే. గతంలో ఢిల్లీని కూడా తన సారథ్యంలోనే ప్లేఆఫ్స్‌నకు చేర్చాడు. అతడి సత్తాను చెప్పేవి ఈ గణాంకాలే. గత సీజన్‌లో కోల్‌కతాకు సారథ్యం వహించి.. ఆ జట్టుకు టైటిల్ కూడా అందించాడు. అయినప్పటికీ ఆ జట్టు వదులుకోవడంతో.. మెగా వేలంలో పంజాబ్ రూ.26.75 కోట్లకు దక్కించుకుంది. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. జట్టును అద్భుత రీతిలో నడిపిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. బ్యాట్‌తోనూ.. సారథి అంటే జట్టును నడిపించడమే కాదు.. జట్టు విజయాల్లో తనవంతు పాత్ర కూడా ఉండాలి. ఈ విజయ సూత్రాన్ని నిరూపిస్తూ ముందుకుసాగుతున్నాడు శ్రేయస్. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే అయ్యర్.. ఇప్పటివరకూ 435 పరుగులు చేశాడు. అందులో ఒక ఇన్నింగ్స్‌లో శతకానికి (97*) చేరువగా వచ్చాడు. ఆ మ్యాచ్‌లో సెంచరీ చేసే అవకామున్నా.. జట్టు కోసమే నిలబడ్డాడు.అనుకున్న గుర్తింపు దక్కిందా..? కోల్‌కతాను విజేతగా నిలబెట్టినా శ్రేయస్‌కు రావాల్సిన గుర్తింపు రాలేదనే విమర్శలూ ఉన్నాయి. ఎందుకంటే.. ఆ జట్టు అతడిని ఆ తర్వాత వదిలేసుకుంది. కోల్‌కతా టైటిల్ విజయంలో అప్పటి మెంటార్ గౌతమ్ గంభీర్‌కే ఎక్కువ క్రెడిట్ దక్కిందనే వాదనలూ ఉన్నాయి. ఈ అంశం పైనే తాజాగా క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ స్పందించాడు. "గత సీజన్‌లో కోల్‌కతాను టైటిల్ విజేతగా నిలబెట్టినా.. శ్రేయస్‌కు తగిన గుర్తింపు లభించలేదు. ఆ ప్రశంసలు మరొకరికి దక్కాయి. జట్టు విజయాల్లో ప్రధాన పాత్ర పోషించేది కెప్టెనే. డగౌట్‌లో కూర్చున్న వ్యక్తి కాదు. ఈ ఏడాది చూడండి.. శ్రేయస్‌కు మంచి పేరు వస్తోంది. కోచ్ రిక్కీ పాంటింగ్‌కు ఎవరూ క్రెడిట్ ఇవ్వడం లేదు" అంటూ గావస్కర్ పరోక్షంగా అప్పటి కోల్‌కతా మెంటార్ గౌతమ్ గంభీర్‌పై వ్యాఖ్యలు చేశాడు.ఛాంపియన్స్ ట్రోఫీలోనూ.. ఐపీఎల్‌లోనే కాదు.. గత ఛాంపియన్స్ ట్రోఫీలోనూ టీమ్‌ఇండియా తరఫున అద్భుత ప్రదర్శన చేశాడు శ్రేయస్. టీమ్‌ఇండియా టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. మరి శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలో పంజాబ్ తొలిసారి టైటిల్ గెలవాలని ఆ జట్టు అభిమానులు కోరుకుంటున్నారు.



# ప్రేమించే వ్యక్తులకు చాహల్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాడు: మహ్‌వశ్

**చాహల్ చాలా కేర్ తీసుకునే వ్యక్తి అని.. ప్రేమించే వ్యక్తులకు అందుబాటులో ఉండే అతని లక్షణాన్ని తాను కూడా అందిపుచ్చుకోవాలనుకుంటున్నానని మహ్‌వశ్ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.**

టీమ్ ఇండియా స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, రేడియో జాకీ మహ్‌వశ్ డేటింగ్‌లో ఉన్నారంటూ గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలోనే ఓ ఇంటర్వ్యూలో చాహల్‌లో ఏ లక్షణం మీకు బాగా నచ్చిందని మహ్‌వశ్‌ను విలేకరి ప్రశ్నించగా.. చాహల్ చాలా మంచివాడని.. వినయపూర్వకంగా ఉంటాడని తెలిపారు. ఆయన నిజంగా చాలా కేర్ తీసుకునే వ్యక్తి అని మహ్‌వశ్ కితాబిచ్చారు. అంతేకాకుండా చాహల్ ఎంత బిజీగా ఉన్నప్పటికీ ప్రేమించే వ్యక్తులకు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా ప్లాన్ చేసుకుంటుంటాడని మహ్‌వశ్ తెలిపారు. అతనిలో ఉన్న ఆ లక్షణాన్ని తాను కూడా అందిపుచ్చుకోవాలనుకుంటున్నానని ఇంటర్వ్యూలో ఆమె పేర్కొన్నారు. మహ్‌వశ్ వ్యాఖ్యలతో వీరిద్దరి బంధంపై సోషల్ మీడియాలో మరోసారి చర్చ మొదలైంది. చాహల్ తన భార్య ధనశ్రీతో ఇటీవల విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. దుబాయ్ వేదికగా జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌ను మహ్‌వశ్, చాహల్ కలిసి వీక్షించారు. మ్యాచ్‌కు ముందు ఓ సెల్ఫీ వీడియో, ఫొటోలను ఆమె తన ఇన్‌స్టా ఖాతాలో పోస్ట్ చేశారు. వీరిద్దరూ కలిసి కన్పించడం ఇదే తొలిసారి కాదు. గతేడాది డిసెంబరులోనూ చాహల్‌తో కలిసి దిగిన ఓ ఫొటోను ఆమె షేర్ చేశారు. అప్పట్లోనే వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు రాగా.. మహ్‌వశ్ వాటిని తోసిపుచ్చింది. అవన్నీ నిరాధారమని, తప్పుడు కథనాలు సృష్టించొద్దని కోరింది. ఇటీవల వీరిరువురు పలు మార్లు కలిసి కనిపిస్తుండడం, సోషల్ మీడియా పోస్టులు పెడుతుండడంతో మరోసారి వీరి ప్రేమ విషయం చర్చనీయాంశమైంది.



## ఆసియా కప్‌నకు దూరమంటూ వార్తలు.. ఖండించిన బీసీసీఐ

ఈ ఏడాది జరగనున్న ఆసియా కప్ టోర్నీ నుంచి టీమ్‌ఇండియా వైదొలగాలని నిర్ణయించినట్లు వార్తలు రాగా.. వీటిని బీసీసీఐ ఖండించింది.

ఇటీవల భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ఏడాది జరగనున్న ఆసియా కప్ టోర్నీ నుంచి టీమ్‌ఇండియా వైదొలగాలని నిర్ణయించినట్లు వార్తలొచ్చాయి. అయితే, వీటిని బీసీసీఐ ఖండించింది. ఈ ఏడాది సెప్టెంబరులో జరిగే పురుషుల ఆసియా కప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అయిన టీమ్‌ఇండియా ఆడే అవకాశాలు లేవని ఆంగ్ల మీడియాలో కథనాలు వచ్చాయి. అంతేకాకుండా జూన్ నెలలో జరిగే మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ నుంచి కూడా వైదొలగాలని బీసీసీఐ నిర్ణయించినట్లు వార్తలొచ్చాయి. ప్రస్తుతం ఆసియా క్రికెట్ మండలికి పాకిస్థాన్ మంత్రి, పీసీబీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీ అధ్యక్షుడిగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తల్లో నిజం లేదని బీసీసీఐ తాజాగా స్పష్టం చేసింది. 'ఈ రోజు ఉదయం నుంచి ఆసియా కప్, మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ టోర్నీల్లో పాల్గొనకూడదని బీసీసీఐ నిర్ణయం తీసుకున్నట్టు జరుగుతున్న ప్రచారం మా దృష్టికి వచ్చింది. అటువంటి వార్తల్లో ఎలాంటి నిజం లేదు. ఇప్పటి వరకు బీసీసీఐ ఏసీసీ ఈవెంట్‌ల గురించి చర్చించలేదు. ప్రస్తుతం మా దృష్టి అంతా ఐపీఎల్‌ను సజావుగా నిర్వహించడం, టీమ్‌ఇండియా పురుషుల, మహిళల జట్ల ఇంగ్లాండ్ పర్యటనపైనే ఉంది. ఆసియా కప్ విషయం లేదా మరేదైనా ఏసీసీ ఈవెంట్ గురించి ఏ స్థాయిలోనూ చర్చ జరగలేదు. దీని గురించి ఏవైనా వార్తలు వస్తే అవన్నీ పూర్తిగా ఊహాజనితం. ఏసీసీ ఈవెంట్ గురించి ఏదైనా చర్చగాని, ముఖ్యమైన నిర్ణయంగాని తీసుకుంటే మీడియాకు వెల్లడిస్తాం' అని బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు.